http://www.agnidharanews.com

# అగ్నిధార

విశాల నిప్పు కణిక

శనివారం 11 ఏప్రిల్ 2026

పేజీలు : 5 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.
ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828

## గృహ గణనలో ఇప్పటికే 5.72 లక్షల కుటుంబాల సెల్ఫ్ ఎన్యుమరేషన్




- స్మార్ట్‌గా, సౌకర్యవంతంగా లక్షలాది కుటుంబాల స్వీయ గణన
- జనగణన డిజిటల్ సదుపాయాల్లో పెరుగుతున్న ప్రజా భాగస్వామ్యం
- 5.72 లక్షల కుటుంబాల సెల్ఫ్ ఎన్యుమరేషన్ : ఆర్‌జీఐ
- ప్రత్యేక మొబైల్ యాప్ - ప్రతీ కుటుంబానికి 33 ప్రశ్నలు
- తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో సెల్ఫ్ ఎన్యుమరేషన్ వేర్వేరు తేదీల్లో జరగనుంది
- ఆంధ్రప్రదేశ్‌లో సెల్ఫ్ ఎన్యుమరేషన్ కాలపరిమితి ఏప్రిల్ 16 నుంచి ఏప్రిల్ 30 వరకు ఉంటుంది.



## ఎన్నికల వేళ మోదీ గిమ్మిక్కులు

- నియోజకవర్గాల పునర్విభజనతో పెను ముప్పు: ఖర్గే
- మహిళా రిజర్వేషన్ల అమలులో కుట్ర
- నియోజక వర్గాల పునర్విభజనపై విపక్షాల ఉమ్మడి పోరుకు ఖర్గే పిలుపు

## ముంచేస్తోన్న డ్రగ్స్




- పల్లెల్లోనూ పెరిగిన గంజాయి వినియోగం
- ఈగల్ ఫోర్స్ సర్వేలో సంచలన విషయాలు
- పల్లెల్లోనూ విరివిగా గంజాయి సరఫరా
- మత్తుకు బానిసవుతున్నవారిలో 35 ఏళ్ల లోపు వారే అధికం
- అవగాహన లేక పెరుగుతున్న మత్తు వినియోగం
- విద్యాభ్యాసం నుంచే అవగాహన కల్పించాలంటున్న నిపుణులు



హైదరాబాద్

రంగుల కలలతో సాగిపోవాల్సిన యువత ప్రస్తుతం మత్తు ఊబిలో కూరుకుపోతోంది. ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాల్సిన వయస్సులో మత్తుకు బానిసవుతున్నారు. ఒకప్పుడు మహానగరాలకే పరిమితమైన మాదక ద్రవ్యాల వినియోగం నేడు పల్లెలకు కూడా ఎగబాకుతోంది. మత్తు సామ్రాజ్యాన్ని కూకటి వేళ్లతో పెకిలించేందుకు రంగంలోకి దిగిన ఎలైట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్‌లా ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఈగల్) ఫోర్స్ తాజా సర్వేలో సంచలన విషయాలు బయటపడ్డాయి. ఇంతకీ సర్వేలో వెలువడిన విషయాలేంటి మత్తు పదార్థాలకు బానిసవుతున్న వారిలో ఎక్కువగా ఎవరున్నారు - మిగతా3లో

ధనిక రాష్ట్రాన్ని అప్పగిస్తే..

## రూ.8 లక్షల కోట్ల అప్పు ఎందుకు?

- మంత్రి జూపల్లి కృష్ణారావు
- నీళ్లు లేని చోట మాత్రం పదేళ్లలో అనేక ప్రాజెక్టులు కట్టారు
- పాలమూరు ప్రాజెక్టు కాలువలకు ఇంకా అనుమతే రాలేదు
- పాలమూరు ప్రాజెక్టుపై రాజకీయాలు చేస్తోంది మీరా? మేమా?







## పాకిస్థాన్ గూఢచార మాడ్యూల్ గుట్టురట్టు చేసిన ఢిల్లీ పోలీసులు

- 'సీసీటీవీ'లతో సైనికుల కదలికలపై నిఘా పెట్టిన ఉగ్రముఠా
- పాకిస్థాన్ హ్యాండర్లతో ఉగ్రముఠాకు సంబంధాలు
- 11 మంది అరెస్టు- సాంకేతికతను ఉపయోగించి సైనిక కదలికలపై నిఘా

## మహిళలకు, నిరుద్యోగులకు రూ.3000 ఆర్థిక సాయం

- చొరబాట్లపై ఉక్కుపాదం
- బంగాల్ బీజేపీ మేనిఫెస్టో ఇదే!
- సోనార్ బంగ్లా రోడ్ మ్యాప్
- బంగాల్ ఎన్నికల కోసం 15 అంశాలతో బీజేపీ మేనిఫెస్టో విడుదల



అన్నా నన్ను దేవుడే పంపిండు మీతో కలిసి

## పని చేయమని..

- జీవన్‌రెడ్డి భావోద్వేగం
- ' తెలంగాణకు నష్టం జరుగుతున్న సమయంలో మీతో కలిసి పనిచేయాల్సిన అవసరమున్నది
- మీతో కలిసి పనిచేయమని దేవుడే నన్ను మీదగ్గరికి పంపించిండు
- చాలా గ్యాప్ తర్వాత ఇన్నాళ్ల కైనా మీతో కలిసిపనిచేసే అవకాశం రావడం సంతోషంగా ఉంది'





సిద్దిపేట

బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్య మంత్రి కేసీఆర్‌ను మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి కేసీఆర్‌ను పలకరిస్తూ భావోద్వేగానికి లోనయ్యారు. 'అన్నా.. నన్ను దేవుడే పంపిండు. మీతో కలిసి పని చేయమని' అంటూ కేసీఆర్‌ను ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఖరిని నిరసిస్తూ కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన జీవన్ రెడ్డి , కుమారులు, జగిత్యాల జడ్పీ మాజీ చైర్ పర్సన్ వసంత సురేశ్ దంపతులు కేసీఆర్‌ను కలిసినవారిలో - మిగతా3లో



## రాజ్యసభ సభ్యునిగా ప్రమాణ స్వీకారం చేసిన నీతీశ కుమార్

- నీతీశ్ చేత ప్రమాణస్వీకారం చేపించిన రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్
- హిందీలో ప్రమాణం చేసిన నీతీశ్ కుమార్
- కార్యక్రమానికి హాజరైన కేంద్రమంత్రులు జేపీ నడ్డా, నిర్మలా సీతారామన్

## ఇంధన భద్రతపై గల్ఫ్ దేశాలతో చర్చలు

- పశ్చిమాసియాలోని పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నాం
- దేశ ఇంధన భద్రతను బలోపేతం చేసేందుకు కేంద్ర మంత్రులు గల్ఫ్ దేశాల్లో పర్యటిస్తున్నారు
- భారత విదేశాంగ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జయస్వాల్

ఆర్టీసీ ఉద్యోగులకు

## శుభవార్త

డీఏ 2.1 శాతం పెంచుతున్నట్లు ప్రకటించిన మంత్రి పొన్నం

- ఆర్టీసీ ఉద్యోగులకు ప్రస్తుతం ఉన్న 50.7 శాతం డీఏను 52.8 శాతానికి పెంపు
- ఈ ఏడాది జనవరి 1 నుంచి వర్తింపు
- రూ.2.82 కోట్ల అదనపు భారం
- ఉద్యోగులకు రూ. కోటి ప్రమాద బీమా
- పెరిగిన డీఏను వరుసగా మూడు నెలలకు ఒక్కో నెలలో సప్లిమెంటరీ బిల్స్ ద్వారా ప్రభుత్వం ఉద్యోగుల ఖాతాల్లో జమ




హైదరాబాద్

తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఉద్యోగుల డీఏను 2.1 శాతం పెంచుతున్నట్లు శుక్రవారం రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. పెరిగిన డీఏ ఈ ఏడాది జనవరి నుంచే అమలు అవుతుందని స్పష్టం చేశారు. ఇంతకు ముందు ఆర్టీసీ - మిగతా3లో

# ముంచేస్తోన్న డ్రగ్స్

-మొదటిపేజీ తరువాయి

వివరాలను తెలుసు కుందాం. గంజాయి మత్తు ఇప్పుడు ఒక మహమ్మారిలా వ్యాపిస్తోంది. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా తెలంగాణను కమ్మేస్తోంది. ముఖ్యంగా యువత ఈ డ్రగ్స్ రక్కసి కోరల్లో చిక్కుకుని విలవిల్లాడుతున్నారు. డ్రగ్స్ అంటే ఖరీదుతో కూడుకున్న వ్యవహారం. హెరాయిన్, కొకైన్ వంటి మత్తు పదార్థాలు కొనడం సామాన్యులకు వీలుకాని పని. కానీ, మత్తు మాఫియా తక్కువ ధరకు లభించే గంజాయిని విచ్చలవిడిగా సరఫరా చేస్తోంది. ఒకప్పుడు నగరాలకే పరిమితమైన ఈ మత్తు పదార్థం ఇప్పుడు గ్రామీణ ప్రాంతాలకూ పాకింది. ప్రధానంగా 26 నుంచి 35 ఏళ్ల లోపు ఉన్న యువతే ఎక్కువగా గంజాయి మత్తుకు బానిసలవుతున్నారని ఈగల్ ఫోర్స్ తాజా సర్వేలో వెల్లడైంది.




### అల్ప్రాజోలం తయారీపై ఉక్కుపాదం

ఈ మత్తు సామ్రాజ్యాన్ని సమూలంగా నిర్మూలించేందుకు 2023లో తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన యాంటీ నార్కోటిక్స్ బ్యూరోనే కొన్ని నెలల కిందట ఈగల్? ఫోర్స్‌గా రూపాంతరం చెందింది. గోవా, ఢిల్లీ, ముంబై, బెంగళూరు లాంటి మెట్రో నగరాల నుంచి వస్తున్న ఖరీదైన మత్తు పదార్థాలపై నిఘా పెడుతూనే, మరోవైపు ఒడిశా నుంచి తెలంగాణ పల్లెల్లోకి చొరబడుతున్న గంజాయి మూలాలపై ఉక్కుపాదం మోపుతోంది. హైదరాబాద్ శివార్లలో అక్రమంగా సాగుతున్న అల్ప్రా జోలం తయారీ కేంద్రాలపై ప్రత్యేక దాడులు నిర్వహిస్తూ, డ్రగ్స్ సప్లయర్స్‌తో పాటు వినియోగదారులను పదుల సంఖ్యలో అరెస్ట్ చేస్తోంది.

### వినియోగిస్తున్న వారే ఎక్కువ

ఈగల్ ఫోర్స్ పట్టుకున్న నిందితుల వివరాలు, వారి నేపథ్యాలు చూస్తే ఎవరైనా విస్తు పోవాల్సిందే! మూడేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన దాడుల్లో ఏకంగా 21,201 మంది నిందితులు పోలీసులకు చిక్కారు. ఇందులో 639 మంది మహిళలు కూడా ఉండటం గమనార్హం. పట్టుబడిన వారిలో 35.19 శాతం మంది డ్రగ్స్ వినియోగదారులే కావడం గమనించాల్సిన విషయం.

### ఉన్నత చదువులు చదివిన వారూ

పట్టుబడిన డ్రగ్స్ సప్లయర్స్, వినియోగదారుల్లో తెలంగాణకు చెందిన వారు 16,592 మంది ఉన్నారు. అంతర్రాష్ట్ర నేరస్థులు 4,544 మంది కాగా, అంతర్జాతీయ నేరస్థులు 65 మంది ఉన్నారు. అండర్ గ్రాడ్యుయేట్లు 11,682 మంది, ప్రాథమిక విద్య చదివిన వారు 2,820 మంది, సెకండరీ విద్య చదివిన వారు 2,502 మంది ఉన్నారు. ఉన్నత చదువులు చదివిన గ్రాడ్యుయేట్లు 3,307 మంది, పోస్ట్ గ్రాడ్యుయేట్లు 890 మంది కూడా ఈ డ్రగ్స్ ఊబిలో చిక్కుకున్నట్లు ఈగల్ సర్వే స్పష్టం చేస్తోంది.

### విద్యా బోధనలో భాగం కావాలి

మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్పరిణామాలపై యువతకు సరైన అవగాహన లేకపోవడంతోనే యువత మత్తుకు బానిసవుతున్నారని నిపుణులు చెబుతున్నారు. ప్రభుత్వాలు కేవలం దాడులకే పరిమితం కాకుండా, ప్రమాదకర మత్తు పదార్థాల గురించి విద్యాభ్యాసంలోనే అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# సైడ్ పార్టీని పట్టుకున్న కవిత వ్యూహం ఏంటి?

**హైదరాబాద్ :** రాజకీయం అంటేనే ఎత్తుగడలు.. మరీ ముఖ్యంగా సొంత గూడు వదిలి బయటకు వచ్చిన నేతలు వేసే అడుగులు చదరంగంలో ఎత్తుల కంటే వేగంగా మారుతుంటాయి. ఈ నెలలోనే ఎజెండాను ప్రకటిస్తానని చెబుతున్న మాజీ ఎంపీ కవిత ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నారు. సహజంగా కొత్త పార్టీ పెడితే అధికార పక్షాన్ని టార్గెట్ చేయడం ఆనవాయితీ.. కానీ, కవిత మాత్రం దీనికి భిన్నంగా వెళ్తున్నారు. అధికార కాంగ్రెస్‌ను కాదని, బలహీనపడ్డ 'కారు' (బీఆర్ఎస్) వెంటే ఆమె ఎందుకు పడుతున్నారు..? ఈ వ్యూహం వెనుక ఉన్న అసలు లెక్కలేంటో చూద్దాం. ప్రస్తుతం తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి తిరుగు లేదన్న వాదన బలంగా వినిపిస్తోంది. ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక ఐకాన్ లీడర్‌గా ఎదిగారు. ఆయన ఇమేజ్ మరోసారి పార్టీని అధికారంలోకి తెస్తుందన్న విశ్వాసం ప్రజల్లో ఉంది. ఇలాంటి సమయంలో బలంగా ఉన్న రేవంత్ రెడ్డిని కదిపితే అనవసరమైన ఇబ్బందులు తప్ప ప్రయోజనం ఉండదని కవిత భావిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే రేవంత్ రెడ్డి జోలికి వెళ్లకుండా, తన రాజకీయ భవిష్యత్తు కోసం మరో మార్గాన్ని ఎంచుకున్నారు. అదే కారు పార్టీని కంగారు పెట్టడం. కేసీఆర్ పదేళ్ల పాలనలో ఎన్నో ప్రాజెక్టులు, పథకాలు ప్రవేశపెట్టినప్పటికీ.. కుటుంబ పాలన, అవినీతి ఆరోపణలు ఆ పార్టీని దెబ్బతీశాయి. గత అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ ఘోర పరాజయాన్ని మూట గట్టుకుంది. ఇప్పుడు బీఆర్ఎస్‌లో నాయకత్వ లేమి, అంతర్గత కలహాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కేసీఆర్ ఫామ్ హౌస్‌కే పరిమితం కావడం, కేటీఆర్-హరీష్ రావు మధ్య విభేదాల వాదనలు వినిపిస్తుండడంతో ఆ పార్టీ క్యాడర్ అయోమయంలో ఉంది. ఈ అనిశ్చిత వాతావరణమే తనకు అనుకూలమని కవిత అంచనా వేస్తున్నారు.ఓటు బ్యాంకు బీఆర్ఎస్ పార్టీకి క్షేత్ర స్థాయిలో ఇప్పటికీ బలమైన కేడర్



ఉంది. ఆ కేడర్ ఇప్పుడు నిరుత్సాహంలో ఉండడంతో, వారిని తన వైపు తిప్పుకోవాలన్నది కవిత పక్కా ప్లాన్. బీజేపీకి నాయకులు ఉన్నా క్షేత్ర స్థాయి ఓటు బ్యాంకు తక్కువగా ఉండడంతో, ఆమె దృష్టి అంతా బీఆర్ఎస్ కేడర్‌పైనే ఉంది. 'కారు'లోని అసంతృప్త నేతలను, నాయకత్వం కోసం వెతుకుతున్న కార్యకర్తలను చేరదీయడం ద్వారా తన కొత్త పార్టీని బలోపేతం చేసుకోవాలని వ్యూహాత్మక అడుగులు వేస్తున్నారు. రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరన్నది జగమెరిగిన సత్యం. నిన్నటి వరకు అదే పార్టీలో ఉండి, ఇప్పుడు అదే పార్టీ ఓటు బ్యాంకును కొల్లగొట్టాలని చూడడం రాజకీయ చదరంగంలో ఒక భాగమే. కవిత వేస్తున్న ఈ 'రివర్స్ వ్యూహం' ఎంత వరకు ఫలమిస్తుంది..? కేసీఆర్ నిర్మించిన కోటలో ఆమె చీలిక తీసుకురాగలదా? అన్నది ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా ఉత్కంఠను రేకెత్తిస్తోంది. ఈ నెల 25న కవిత ప్రకటించబోయే జెండా, అజెండాలో బీఆర్ఎస్ పార్టీకి సంబంధించి ఎలాంటి అంశాలు ఉంటాయన్నది కీలకం. కాంగ్రెస్‌ను కాదని బీఆర్ఎస్‌ను టార్గెట్ చేయడం ద్వారా ఆమె తెలంగాణ రాజకీయ చిత్రపటాన్ని మార్చాలని చూస్తున్నారు. ఒకవేళ బీఆర్ఎస్ కేడర్ ఆమె వైపు మొగ్గు చూపితే, రాష్ట్రంలో విపక్ష హోదా కోసం సరికొత్త పోరాటం మొదలవుతుంది. ఏదేమైనా కవిత వేస్తున్న ఈ ఎత్తుగడలు గులాబీ శ్రేణుల్లో మాత్రం గుబులు పుట్టిస్తున్నాయి.

# 2028 నాటికి జిల్లాల పునరవ్యవస్థీకరణ

**హైదరాబాద్ :** రాష్ట్రంలో పాలనను ప్రజలకు మరింత చేరువ చేయడమా లేక రాజకీయంగా పట్టు సాధించడమా? కారణం ఏదైనా తెలంగాణలో జిల్లాల సరిహద్దుల మార్పు ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. గత ప్రభుత్వం (బీఆర్ఎస్) చేసిన జిల్లాల విభజనలో లోపాలున్నాయని, శాస్త్రీయత లేదని భావించిన కాంగ్రెస్ సర్కార్, ఇప్పుడు సర్జరీకి సిద్ధమైంది. ఈ మార్పులు కేవలం భౌగోళిక సరిహద్దులకే పరిమితమా? లేక కొత్త జిల్లాల ఏర్పాటుకు దారితీస్తాయా? అన్నది ఆసక్తికరంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన విభజనలో కొన్ని ప్రాంతాలను తమ రాజకీయ ప్రయోజనాల కోసం కలిపారని, దీనివల్ల ప్రజలకు దూరాభారం పెరిగిందని ప్రస్తుత ప్రభుత్వం భావిస్తోంది. రేవంత్ రెడ్డి వ్యూహం ప్రకారం.. కేవలం జిల్లాల సంఖ్యను పెంచడం కాకుండా, భౌగోళికంగా, పరిపాలనా పరంగా ప్రజలకు దగ్గరగా ఉండేలా సరిహద్దులను సవరించడమే ప్రధాన లక్ష్యం. ఇప్పటికే ఐఏఎస్ అధికారుల నుంచి నివేదికలు తెప్పించుకున్న ప్రభుత్వం, ఏ ఏ జిల్లాలను విడగొట్టాలి లేదా ఏ ప్రాంతాలను పక్క జిల్లాల్లో కలపాలి అనే అంశంపై ప్రాథమిక అవగాహనకు వచ్చినట్లు తెలుస్తోంది.ప్రస్తుతం దేశవ్యాప్తంగా జనగణన ప్రక్రియ ప్రారంభం కావడంతో, నిబంధనల ప్రకారం.. జిల్లాల సరిహద్దులను మార్చడానికి వీలులేదు. ఈ ప్రక్రియ 2028 చివరి నాటికి పూర్తయ్యే అవకాశం ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం తన పదవీకాలం ముగిసేలోగా ఈ భారీ ఆపరేషన్ పూర్తి చేయాలని చూస్తోంది. దీనివల్ల రాబోయే అసెంబ్లీ ఎన్నికల నాటికి కొత్త జిల్లాల సెంటిమెంట్, ప్రజల ఆకాంక్షలను తమకు అనుకూలంగా మార్చుకోవచ్చనేది రాజకీయ వ్యూహం.కేవలం జిల్లాల సరిహద్దుల మార్పు మాత్రమే కాకుండా, భవిష్యత్తులో జరగబోయే అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనను కూడా దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఈ అడుగులు వేస్తున్నట్లు సమాచారం. జిల్లా కేంద్రానికి, నియోజకవర్గ కేంద్రానికి మధ్య ఉన్న దూరాన్ని తగ్గించడం ద్వారా అభివృద్ధి ఫలాలు క్షేత్ర స్థాయికి వేగంగా చేరుతాయని ప్రభుత్వం వాదిస్తోంది. ముఖ్యంగా ఉమ్మడి జిల్లాల సెంటిమెంట్‌ను గౌరవిస్తూనే, పరిపాలనలో వస్తున్న ఇబ్బందులను తొలగించడం ద్వారా ఓటర్లను ఆకట్టుకోవాలని కాంగ్రెస్ భావిస్తోంది. జిల్లాల పునర్విభజన అనేది ఎప్పుడూ ఒక డబుల్ ఎడ్జ్ స్వార్డ్ (రెండంచుల కత్తి) లాంటిదే. ఒక ప్రాంతాన్ని జిల్లాగా ప్రకటించినప్పుడు వచ్చే మైలేజీ కంటే, కీలకమైన ప్రాంతాలను పక్క జిల్లాల్లో కలిపినప్పుడు వచ్చే వ్యతిరేకత ఎక్కువగా ఉంటుంది. అందుకే రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈసారి అనాలోచితంగా కాకుండా,




ప్రజల నుంచి అభిప్రాయ సేకరణ చేపట్టి, అఖిలపక్ష సమావేశాల ద్వారా ఏకాభిప్రాయం సాధించాలని చూస్తోంది. ఏది ఏమైనా, 2028 నాటికి తెలంగాణ రాజకీయ చిత్రపటం మరోసారి మారడం ఖాయంగా కనిపిస్తోంది.

## ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం శుభవార్త

-మొదటిపేజీ తరువాయి

ఉద్యోగులకు 50.7 శాతం డీఏ ఉండగా, తాజా పెంపుతో అది 52.8 శాతానికి పెరిగింది. దీంతో పెరిగిన డీఏ ద్వారా ఆర్టీసీ సంస్థపై ప్రతి నెలా రూ.2.82 కోట్ల అదనపు భారం పడనుంది. జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలకు పెరిగిన డీఏను వరుసగా మూడు నెలలకు ఒక్కో నెలలో సప్లిమెంటరీ బిల్స్ ద్వారా ప్రభుత్వం ఉద్యోగుల ఖాతాల్లో జమ చేయనుంది. గత సంవత్సరం (2025) జులైలో డీఏను 2.1 శాతం పెంచిన సంగతి తెలిసిందే. అప్పుడు 48.6 శాతం నుంచి 50.7 శాతానికి పెంచారు.

### అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలి

డీఏ పెంపు సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగులకు మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేసి అభివృద్ధి కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టాలని సూచించారు. "తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కార్మికులకు సంబంధించి పెండింగ్ ఉన్న ఏకైక డీఏను కూడా ఇవ్వడానికి నిర్ణయం తీసుకున్నాం. జనవరి 2026 నుంచి 2.1 శాతం డీఏను పెంచుతున్నాం. మొదటి నుంచి సంస్థ మూడు ప్రధాన అంశాలపై పని చేస్తుంది. కార్మికుల సంక్షేమం, ప్రయాణికుల సౌకర్యం, సంస్థ పరిరక్షణ-అభివృద్ధి. ప్రధానంగా సంస్థలో భాగస్వాములైన కార్మికుల సంక్షేమంపై వారికి సంబంధించిన ఆరోగ్య సంరక్షణకు ఆసుపత్రి అప్‌గ్రేడేషన్, కారుణ్య నియామకాలు, దీర్ఘ కాలంగా రిమూవ్ అయిన వారిని త్రిమెన్ కమిటీ ద్వారా తిరిగి విధుల్లోకి తీసుకోవడం, కొత్త నియామకాలు చేపట్టి ఉన్న కార్మికులపై పని భారం తగ్గించడం, కొత్త బస్సులు కొనుగోలు లాంటి అనేక కార్యక్రమాలు చేస్తున్నాం. లైఫ్? లైన్ అయినటువంటి ఆర్టీసీని మరింత ముందుకు తీసుకువెళ్తున్నాం"

### ఉద్యోగులకు రూ. కోటి ప్రమాద బీమా

తమ ఉద్యోగులకు రూ.కోటి ప్రమాద బీమా పథకాన్ని అమలు ఆర్టీసీ చేస్తోంది. ఉద్యోగుల సామాజిక భద్రతను మరింత మెరుగు పరిచేందుకు సహజ మరణానికి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా రూ.10 లక్షల బీమా కల్పించనున్నట్లు ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి తెలిపారు. ఈ నిర్ణయం ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమలతుందని తెలిపారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ)లో సాలరీ అకౌంట్ ఉన్న ఉద్యోగులకు ఈ బీమా వర్తిస్తుంది. ఈ నిర్ణయంతో సంస్థలో పనిచేస్తున్న దాదాపు 38 వేలకు పైగా ఉద్యోగుల కుటుంబాలకు ఆర్థిక భరోసా లభించిందని ఎండీ తెలిపారు.

### ఏ క్షణంలోనైనా సమ్మె

ఈనెల 23 తర్వాత ఏ క్షణంలోనైనా సమ్మెకు వెళ్లే అవకాశం ఉందని ఆర్టీసీ జేఏసీ ఛైర్మన్ వెంకన్న, వైస్ ఛైర్మన్? థామస్ రెడ్డిలు గురువారం తెలిపారు. ఆర్టీసీ క్రాస్ రోడ్స్?లోని కార్మిక శాఖ కార్యాలయంలో లేబర్ డిపార్ట్?మెంట్ అధికారులతో ఆర్టీసీ జేఏసీ నేతలు సమావేశం అయ్యి పలు సమస్యలపై చర్చించారు. దీనికి ఆర్టీసీ అధికారులు హాజరు కాకపోవడంతో పూర్తిస్థాయిలో చర్చ జరగలేదని జేఏసీ నేతలు చెప్పారు.

ఈనెల 13వ తేదీన మరోసారి లేబర్ కమిషనర్, ఆర్టీసీ యాజమాన్యంతో చర్చలు ఉంటాయని ఆ తర్వాత సమ్మెపై పూర్తిస్థాయిలో స్పష్టత వస్తుందని ఐక్య కార్యాచరణ సమితి నేతలు పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, యాజమాన్యం కలిసి కార్మికుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించి వాటి పరిష్కారానికి సానుకూలంగా స్పందించాలని విజ్ఞప్తి చేశారు.

## అన్నా నన్ను దేవుడే పంపిండు మీతో కలిసి పని చేయమని..

-మొదటిపేజీ తరువాయి

ఉన్నారు. ఈ సందర్భంగా ఎర్రవెల్లిలోని కేసీఆర్ నివాసానికి తొలిసారి వచ్చిన జీవన్ రెడ్డిని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్, ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్సీ ఎల్ రమణ, ఎమ్మెల్యే డా. కె.సంజయ్, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, మాజీ ఎమ్మెల్యే కె. విద్యాసాగర్ రావు, పార్టీ నేతలు గ్యాదరి బాలమల్లు, మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. తెలంగాణకు నష్టం జరుగుతున్న సమయంలో మీతో కలిసి పనిచేయాల్సిన అవసరమున్నదని, మీతో కలిసి పనిచేయమని దేవుడే నన్ను మీదగ్గరికి పంపించిండు. చాలా గ్యాప్ తర్వాత ఇన్నాళ్ల కైనా మీతో కలిసిపనిచేసే అవకాశం రావడం సంతోషంగా ఉంది' అంటూ మనసులోని మాటను వ్యక్తం చేశారు. ఈ సంద్భంగా జీవన్‌రెడ్డిని కేసీఆర్ సన్మానించారు.

## ధనిక రాష్ట్రాన్ని అప్పగిస్తే.. రూ.8 లక్షల కోట్ల అప్పు ఎందుకు?

**హైదరాబాద్:** గత ప్రభుత్వ నాయకులకు సరైన ఆలోచన, అవగాహన లేక రాష్ట్రానికి తీవ్ర నష్టం చేశారని మంత్రి జూపల్లి కృష్ణారావు ఆరోపించారు. నీళ్లు లేని చోట మాత్రం పదేళ్లలో అనేక ప్రాజెక్టులు కట్టారని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీకి ధనిక రాష్ట్రం అప్పగిస్తే, రూ.8 లక్షల కోట్లు ఎందుకు అప్పు చేశారని విమర్శించారు. పాలమూరు ప్రాజెక్టు కాలువలకు ఇంకా అనుమతే రాలేదన్న జూపల్లి.. పాలమూరు ప్రాజెక్టుపై రాజకీయాలు చేస్తోంది మీరా? మేమా? అని నిలదీశారు. పాలమూరు ప్రాజెక్టును 80శాతం పూర్తి చేశామని అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు.

## పొంచి ఉన్న తాగు నీటి సంక్షోభం

**హైదరాబాద్ :** తెలంగాణలోని నీటి జలాశయాలు దాదాపు ఎండిపోయే పరిస్థితికి చేరుకున్నాయి. దీంతో హైదరాబాద్ కు నీటిఎద్దడి సమస్య తలెత్తుతుందన్న అలెర్ట్ ఇప్పటికే అందింది. వేసవి కాలంలో నీటి ఎద్దడి మామూలే. గతలో ఎన్నడూ లేని విధంగా ఎండల తీవ్రత ఈ ఏడాది మార్చి నెల నుంచి ఉండటంతో నీటి సరఫరా జలమండలికి కష్టంగా మారింది. మార్చి మొదటి వారం నుంచే ట్యాంకర్లను బుక్ చేసుకుంటున్నారంటే పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతుందని చెప్పాలి. మరొకవైపు గతంలో రోజుకు గంట నుంచి రెండు గంటల పాటు వచ్చే నల్లా నీరు ఇప్పుడు అరగంట వచ్చిన తర్వాత సన్నటి ధార వస్తుండటం మంచినీటి ఎద్దడికి ఉదాహరణగా చూడాలి.సాగునీటి సంగతి పక్కన పెడితే తాగు నీటికి కూడా ఈ ఏడాది ఇబ్బందులు తప్పవని హెచ్చరిస్తున్నారు. అందుకే నీటివృధాను అరికట్టాలని జలమండలి అధికారులు ఎప్పటికప్పుడు నగర ప్రజలకు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. గతంలో మే నెలలో కొంత నీటి ఎద్దడి ఉండేది. ఈసారి మార్చి నెల నుంచే ప్రారంభమయింది. నీరు వృధా చేసినా, తాగు నీటితో వాహనాలు శుభ్రంచేసినా జరిమానా విధిస్తామని జలమండలి అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రజలు కూడా జలమండలి అధికారులతో సహకరించాల్సి ఉంది. మరొకవైపు భూగర్భ జలాలు ఎండిపోవడంతో నగరంలో అనేకచోట్ల బోర్లు ఎండిపోయాయి. చుక్క నీరు కూడా బోరు నుంచి రాకపోవడంతో ట్యాంకర్లకు వేల రూపాయలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.నాగార్జునసాగర్ ప్రాజెక్టులో కేవలం 176.06 టీఎంసీలుమాత్రమే ఉన్నాయి. శ్రీశైలం ప్రాజెక్టులో 43.75 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. దాదాపు డెడ్ స్టోరేజీకి ప్రాజెక్టులు చేరుకున్నాయి. శ్రీరాం సాగర్ ప్రాజెక్టులో 28.83 టీఎంసీలు, నిజాం సాగర్ లో 9 టీఎంసీలు, జూరాలలో 9.66 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. కృష్ణా, గోదావరి నదుల్లో కూడా నీరు లేకపోవడంతో ఇక రానున్నకాలంలో హైదరాబాద్ కు తీవ్రమైన నీటి సంక్షోభం పొంచి ఉందన్న హెచ్చరికలు వినపడుతున్నాయి. ఎగువ రాష్ట్రాల్లో వానలు పడితేనే ఏమైనా నీరు వచ్చి జలాశయాలకు చేరుతుంది. కానీ ఇప్పుడు ఆసమస్య లేదు. మరొకవైపు వచ్చే ఏడాది వర్షపాతం తక్కువగా నమోదవుతాయని భారత వాతావరణ శాఖ చేసిన హెచ్చరికలు కూడా పరిస్థితి తీవ్రతకు మరింత అద్దంపడుతుంది. మొత్తం మీద చుక్కనీటిని వృధా చేయకుండా ప్రజలు కూడా అధికారులకు సహకరించాలని కోరుతున్నారు.



## సంపాదకీయం

# ఏకధ్రువ ప్రపంచానికి చెక్ పెట్టినట్లేనా!

ప్రతిమనిషి పుట్టుకతోనే జీవించే హక్కుతో భూమిమీదకు వస్తాడు. మరణం అనేది ఆ హక్కుకు దూరం కావడమే! సాధారణ మరణం సహజ ప్రక్రియ. యుద్ధ మరణం అనేది ఉన్మాద చర్యతో జీవించే హక్కును అర్థాంతరంగా తుంచివేయడం. అందుకే ఏరకమైన యుద్ధమైనా వినాశ హేతువే? యుద్ధం ఒక పీడకచర్య. యుద్ధ మరణాలకు హేతుబద్ధత ఉండదు. మధ్యయుగాలలో యుద్ధమంటే వీరత్వానికి ప్రతీక. అటు తర్వాత ఆయుధం ప్రధానపాత్ర వహించింది. అధికారానికి ఆయుధం ప్రాకారంగా నిలిచింది. సాంకేతికత అభివృద్ధి చెందిన ఈ దశలో ఆయుధానిదే పైచేయి అయింది. ఇప్పుడు యుద్ధ వ్యూహాల్లో మార్పులొచ్చాయి. ఒకప్పుడు రష్యా, అమెరికా ప్రచ్ఛన్న యుద్ధస్థితి నుంచి, రష్యా అంతర్గత రాజకీయ మార్పుల తర్వాత అమెరికా ఏకధృవ ప్రపంచంగా ఎదిగింది. అంతేకాదు, తమ భూభాగంలో కాకుండా ప్రపంచం మొత్తం యుద్ధ స్థావరాలు ఏర్పరచుకొని, సైన్యాన్ని మోహరించి ప్రపంచ పోలీసుగా పెత్తనం చేస్తోంది. జనరల్ గడాఫీ, అలెండీ, సద్దాం హుస్సేన్ లాంటి ఎందరో దేశాధినేతలను హత్య చేయడంతో పాటు, ఆసియా, అమెరికా, ఆఫ్రికా ఖండాల్లో అనేక దేశాలతో యుద్ధాలు చేసింది. చివరకు తమ వ్యాపార సామ్రాజ్యానికి పోటీరాకుండా జపాన్‌లోని హిరోషిమా, నాగసాకి నగరాలపై అణుబాంబులు వేసి సాముహిక మానవహననానికి అమెరికా పాల్పడింది. వియత్నాంతో పదహారేళ్ల సుదీర్ఘ యుద్ధం తర్వాత అమెరికా దూకుడుకు కళ్లెం పడింది. ఇప్పుడు ఇరాన్‌తో భూతల యుద్ధంతో తలపడడం అంటే చావునోట్లో తలపెట్టడమేనన్న వ్యవహారం అర్థమైన తర్వాత ఇంటా, బయట ఏకాకిగా మారిన ట్రంప్, వ్యూహం మార్చి ఇరాన్‌తో సీజ్ ఫైర్‌కు తాపత్రయ పడ్డాడు. వ్యూహాత్మకంగా ఊపిరి పీల్చుకోవడానికి ఇరాన్ కూడా పది షరతులతో సిద్ధమైంది. సీజ్‌ఫైర్ అనబడే ఒప్పందం అనేది ఇటీవల కాలంలో ముందుకొచ్చిన దౌత్య ప్రక్రియనే. ఒకప్పుడు గ్రూపుల మధ్య ఒప్పందం ఇప్పుడు దేశాల మధ్యకు మారింది. భారత్–పాకిస్తాన్, ఇరాన్–ఇజ్రాయిల్ యుద్ధాలలో ట్రంప్ ముందుకు తెచ్చిన ప్రక్రియనే ఇది. కొత్తదేం కాదు, కాకుంటే ఓటమి అంచుల్లో పరువు దక్కించుకునే ఏకైక సూచిక! ట్రంప్ రెండువారాల యుద్ధ వెసులుబాటుకు ప్రయత్నమే ఆయనలో నెలకొన్న ఓటమి భయానికి నిదర్శనం. ఇరాన్‌లో 240మంది మహిళలు, 212 మంది పిల్లలు వెరసి 2076 మంది ప్రజలు యుద్ధంలో మరణించారు, 26,500 ప్రజలు గాయపడ్డారు. మిత్రదేశం లెబనాన్‌లో మరో 13వందల మంది ప్రజలను ఇజ్రాయిల్ చంపేసింది. అంతేకాదు, యుద్ధ ప్రారంభంలోనే ఇజ్రాయిల్, అమెరికా కుట్రపూరితంగా ఇరాన్ సుప్రీం లీడర్ అయుతుల్లా ఖొమైనీని అంతం చేసింది. అయినా ఇరాన్ తమ మౌలిక వనరుల రక్షణ దృష్టితో సీజ్‌ఫైర్‌కు అంగీకరించింది. సుదీర్ఘ కాలం తమవెంట ఉన్న పశ్చిమ యూరప్ దేశాల యుద్ధ కూటమి "నార్త్ అట్లాంటిక్ ట్రిటీ ఆర్గనైజేషన్' నాటోలోని 30 దేశాలు ఇరాన్‌పై ట్రంప్ దాడికి మద్దతివ్వలేదు. సరికదా కొన్ని దేశాలు నేరుగా ఇరాన్‌కు మద్దతు తెలిపాయి. ఇక ప్రపంచ దేశాల ప్రజలతో పాటు, తనదేశంలో ప్రజలు నిరసన పతాకస్థాయికి చేరడంతో ట్రంప్ ఓ అడుగు సీజ్‌ఫైర్ పేరుతో వెనక్కి తగ్గాడు తప్ప, తనలోని యుద్ధ పిపాసి ఇంకా చావలేదు. ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత పిచ్చోడి చేతిలో రాయిలా ప్రపంచ దేశాలపై టారిఫ్‌ల పేరుతో విరుచుకుపడ్డాడు. గాజా విషయంలో ఇజ్రాయిల్ అమానుష కాండకు పరోక్షంగా మద్దతిచ్చాడు. పనామా అధ్యక్షుడు నోరిగోను మాదకద్రవ్యాల పేరుతో జైలు శిక్ష వేసి నిర్భందించాడు."ఆపరేషన్ అబ్జార్వేట్ రిజర్వ్" పేరుతో ప్రజలచేత ఎన్నికైన వెనెజులా అధ్యక్షుడు మదురో, ఆయన భార్య సిలియాలను అర్థరాత్రి ఇంటినుంచి కిడ్నాప్ చేసి అమెరికా జైలులో నిర్బంధించాడు.కేవలం ఆయిల్‌పై నియంత్రణ కోసం ఒకదేశ సార్వభౌమత్వాన్ని ప్రశ్నార్థకం చేయడమే కాక, తన పదవీ కాలం ముగిసిన తర్వాత వెనెజులాలో ఎన్నికలని కుళ్లు జోకులు వేస్తున్నాడు. పక్క రాష్ట్రం మెక్సికోతో ఘర్షణ, చిన్నదీవి లాంటి దేశం క్యూబాపై మానవత్వం మరచి ఆంక్షలు పెట్టడంతో పాటు, ఇరాన్ యుద్ధం తర్వాత క్యూబా అంతు చూస్తానంటున్నాడు. మరోవైపు పక్క దేశం కెనడాను తమదేశంలో అంతర్భాగం రాష్ట్రంగా కలుపుకుంటామని అవాకులు చవాకులు పలుకుతున్నాడు. నాటోలో అంతర్భాగమైన డెన్మార్క్‌కు చెందిన గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకుంటామని ప్రకటించి నాటో కూటమి దేశాల్లో తమ పరపతి కోల్పోయాడు. ఆఫ్ఘనిస్తాన్‌లోని కాందహార్ విమానాశ్రయం కావాలని పట్టుబడుతున్నాడు. ఇవన్నీ ట్రంప్ ఆయా దేశాల సార్వభౌమాధికారాన్ని గౌరవించకుండా వేస్తున్న చిల్లర వేషాలు తప్ప మరొకటి కాదు. మరో ముఖ్యమైన విషయం. ఎప్‌స్టీన్ ఫైల్స్ నుండి బయటపడడం కోసం, అత్యంత పెద్దదైన ఆసియా ఖండంలో పట్టుకోసం మరో యుద్ధోన్మాద దేశం ఇజ్రాయిల్‌తో కలిసి కుట్రపన్నాడు! ఇరాన్‌ను ఓడిస్తే తనకు ప్రపంచంలో తిరుగుండదని, యుద్ధ ప్రారంభంలోనే ఖొమైనీ లాంటి ఆయువుపట్టును లేపేస్తే, తాను వెనెజులా దేశంలా ఇరాన్‌ను కబళించి ఆధిపత్యం చెలాయించాలని చేసిన ప్రయోగం బెడిసికొట్టింది. నలభై రోజులుగా యుద్ధంలో ఇరాన్ అటు ఇజ్రాయిల్‌తో పోరాడుతూనే, అమెరికా అవకాశ ఆధిపత్యాన్ని వ్యూహాన్ని సవాల్ చేసి నిలబడింది. ఇరానియన్ రిపబ్లిక్ గార్డుల ధైర్య సాహసాలముందు అమెరికా తలవంచక తప్పలేదు. అగ్రరాజ్య ఆధునిక యుద్ధ విమానాలను కూల్చివేయడంతో ట్రంప్ దిక్కుతోచని స్థితిలో పడ్డాడు. అంతర్గత సంక్షోభం, అధికార మార్పిడి లాంటి మాటలు ఇరాన్‌లో తుత్తునీయలు కావడం, ప్రపంచ పాలక వర్గాలు ఎలావున్నా ప్రజలు మద్దతు ఇరాన్‌కు అను కూలంగా ఉండడం, ఇరాన్ కూడా భౌగోళిక యుద్ధ తంత్రం హోర్ముజ్ జలసంధి మూసివేత, గల్ఫ్‌లో ఉన్న సౌదీ అరేబియా తదితర దేశాల్లో అమెరికా సైనిక శిబిరాలు, ఆయా దేశాల సాంకేతిక, ఆర్థిక వనరులపై వ్యూహాత్మకంగా దాడులు జరపడం ద్వారా అమెరికాకు వణుకు పుట్టించిందని చెప్పవచ్చు. ఇజ్రాయిల్ కోసం అమెరికా ఇరాన్‌పై దండయాత్రకు దిగింది. తమకు అమెరికా ప్రజలతో ఎలాంటి శత్రుత్వం లేదని ఇరాన్ ప్రకటించడం ఆ దేశ కుయుక్తిని ఎండగట్టింది. అమెరికా ఇరాన్ యుద్ధంలో ఒంటరై ఏకధృవ ప్రపంచం ఏవగింపునకు గురైంది. ఈ దశలో సీజ్‌ఫైర్ రెండు వారాల తర్వాత శాశ్వత ఒప్పందం జరుగుతుందా? యూటర్న్ తీసుకుంటుందా? ఈ విషయం నిర్ధారించే పరిస్థితి లేదు. ఎందుకంటే ఒప్పందం జరిగింది అమెరికా–ఇరాన్ మధ్య కనుక తాము యుద్ధం ఆపేది లేదని ఇజ్రాయిల్ తన యుద్ధ దాహం తీరక లెబనాన్‌పై బాంబుల వర్షం కురిపిస్తోంది. అందుకు ప్రతిగా ఇరాన్ సైతం గల్ఫ్‌లో ఇజ్రాయిల్, అమెరికా అనుకూల దేశాలపై దాడులు చేస్తోంది. అమెరికా–ఇరాన్ యుద్ధం ద్వారా రష్యా ఒకింత ఆయిల్ వ్యాపార రిత్యా, ఉక్రెయిన్ వైపు అమెరికా ఆయుధ సంపత్తి అందకుండా చేయడంలో సఫలమైంది. చైనా, ఉత్తరకొరియా, రష్యా దేశాలు ఇరాన్‌కు అందించిన సాంకేతిక, ఆయుధ మద్దతు ఆ దేశం నిలబడడానికి చాలా తోడ్పాటునందించింది. హోర్ముజ్ జలసంధి విషయంలో చైనా, రష్యా, ఫ్రాన్స్ ఐక్యరాజ్యసమితిలో తమ వీటో అధికారంతో ఇరాన్‌కు మద్దతు పలకడం అమెరికా ఏకఛత్రాధిపత్యానికి ఒక రకంగా చెక్ పెట్టినట్లే!

# సామాజిక న్యాయం ప్రపంచ శాంతికి వారధి



మానవ నాగరికత పరిణామ క్రమంలో పారిశ్రామిక విప్లవం ఒక మైలురాయి. అయితే, యంత్రాల హోరులో మనిషి శ్రమ దోపిడీకి గురవ్వడం, అమానవీయ పరిస్థితుల్లో కార్మికులు మగ్గిపోవడం ఆ విప్లవం తెచ్చిన మరో చీకటి కోణం. ఈ నేపథ్యంలో, "సామాజిక న్యాయం లేకుండా శాశ్వత ప్రపంచ శాంతి సాధ్యం కాదు" అనే గొప్ప ఆశయంతో ఉద్భవించిన అరుదైన వ్యవస్థ 'అంతర్జాతీయ కార్మిక సంస్థ'. ప్రపంచ చరిత్రలో కార్మిక హక్కుల పరిరక్షణకు ఒక దిక్సూచిలా నిలిచిన ఈ సంస్థ, గత శతాబ్ద కాలంగా శ్రామిక లోకానికి రక్షణ కవచంగా నిలుస్తోంది. 19వ శతాబ్దపు చివరలో, 20వ శతాబ్దపు ప్రారంభంలో ఐరోపా, అమెరికా ఖండాల్లో పారిశ్రామికీకరణ వేగంగా విస్తరించింది. కానీ, కార్మికులకు కనీస వేతనాలు లేవు, పని గంటలకు పరిమితి లేదు, ప్రాణాలకు రక్షణ లేని ప్రమాదకర వాతావరణం నెలకొంది. ఈ దోపిడీపై ప్రపంచవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత ప్రపంచ దేశాలు శాంతి స్థాపన కోసం చర్చలు జరుపుతున్న తరుణంలో, కార్మిక సమస్యల పరిష్కారం కూడా ప్రపంచ శాంతిలో అంతర్భాగమేనని గుర్తించారు. ఈ క్రమంలోనే 1919లో జరిగిన 'వెర్సైల్లెస్ శాంతి ఒప్పందం' ద్వారా ఐ.ఎల్.ఓ ఆవిర్భవించింది. మొదట ఇది 'లీగ్ ఆఫ్ నేషన్స్'కు అనుబంధంగా పనిచేసినప్పటికీ, రెండో ప్రపంచ యుద్ధం తర్వాత 1946లో ఐక్యరాజ్య సమితిలో చేరిన మొట్టమొదటి ప్రత్యేక అనుబంధ సంస్థగా గుర్తింపు పొందింది. దీని ప్రధాన కార్యాలయం స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో ఉంది. ఐ.ఎల్.ఓ యొక్క అత్యంత విశిష్టమైన లక్షణం దాని 'త్రైపాక్షిక నిర్మాణం'. ప్రపంచంలోని మరే ఇతర అంతర్జాతీయ సంస్థలోనూ ఇటువంటి ప్రజాస్వామ్య వ్యవస్థ కనిపించదు. ఇందులో ప్రభుత్వ ప్రతినిధులతో పాటు, యజమానుల సంఘాల ప్రతినిధులు, కార్మిక సంఘాల ప్రతినిధులు సమాన స్థాయిలో కూర్చుని నిర్ణయాలు తీసుకుంటారు. ఈ నిర్మాణం వల్ల ఏ చట్టం లేదా ప్రమాణం రూపొందించినా, అది క్షేత్రస్థాయిలో అమలు కావడానికి అవసరమైన సమతుల్యత దొరుకుతుంది. ఈ సంస్థ మూడు ప్రధాన విభాగాలుగా పనిచేస్తుంది. 'అంతర్జాతీయ కార్మిక సదస్సు' ఏటా ప్రమాణాలను నిర్ణయిస్తే, 'పాలక మండలి' కార్యనిర్వాహక బాధ్యతలు చేపడుతుంది. 'అంతర్జాతీయ కార్మిక కార్యాలయం' సచివాలయంగా సేవలందిస్తుంది. ఐ.ఎల్.ఓ లక్ష్యాల గురించి మాట్లాడుకుంటే, 1944లో ఆమోదించిన 'ఫిలడెల్ఫియా ప్రకటన' అత్యంత కీలకమైనది. "పేదరికం ఎక్కడున్నా అది ప్రపంచ సంపదకు ముప్పు" అని ఈ ప్రకటన ఘోషించింది. శ్రమ అనేది విక్రయ వస్తువు కాదని, భావప్రకటన స్వేచ్ఛ మరియు సంఘటితమయ్యే హక్కు పురోగతికి మూలమని ఇది చాటిచెప్పింది. ఈ స్ఫూర్తితోనే ఐ.ఎల్.ఓ ఇప్పటివరకు 190కి పైగా ఒప్పందాలను, 200కి పైగా సిఫార్సులను రూపొందించింది. వీటిలో ఎనిమిది ఒప్పందాలను 'కోర్ కన్వెన్షన్స్'గా పరిగణిస్తారు. బలవంతపు చాకిరీ నిర్మూలన, సంఘటిత హక్కు, సమాన వేతనం, వివక్ష రూపుమాపడం, మరియు బాల కార్మిక వ్యవస్థ అంతం చేయడం వంటివి ఇందులో భాగాలు. ముఖ్యంగా 1919లోనే 8 గంటల పని దినం, వారానికి 48 గంటల పని సమయాన్ని ప్రతిపాదించడం అప్పట్లో ఒక విప్లవాత్మక మార్పు. ప్రస్తుతం 187 సభ్యదేశాలతో విస్తరించిన ఈ సంస్థ, 1969లో తన 50వ వార్షికోత్సవం సందర్భంగా 'నోబెల్ శాంతి బహుమతి'ని గెలుచుకుంది. ఇది కేవలం ఆర్థిక ప్రయోజనాల కోసం కాకుండా, మానవ గౌరవం కోసం చేస్తున్న కృషికి దక్కిన అంతర్జాతీయ గుర్తింపు. 1999లో జువాన్ సోమావియా డైరెక్టర్ జనరల్‌గా ఉన్న సమయంలో 'డీసెంట్ వర్క్'(గౌరవప్రదమైన ఉపాధి) అనే సరికొత్త నినాదాన్ని ఐ.ఎల్.ఓ తెరపైకి తెచ్చింది. కేవలం పని దొరకడం ముఖ్యం కాదు, అది మనిషి ఆత్మగౌరవాన్ని కాపాడేలా, సామాజిక భద్రతతో కూడినదిగా ఉండాలని ఇది స్పష్టం చేస్తోంది. భారతదేశ దృక్పథంలో చూస్తే, మన దేశం ఐ.ఎల్.ఓ స్థాపక సభ్య దేశాలలో ఒకటి. మన రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలు, కార్మిక చట్టాలపై ఐ.ఎల్.ఓ ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. 1923 నాటి కార్మికుల నష్టపరిహార చట్టం నుండి నేటి 'లేబర్ కోడ్స్' వరకు అన్నీ అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగానే రూపుదిద్దు కున్నాయి. అయితే, గణాంకాలు నేటికీ సవాలు విసురుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా సుమారు 200 కోట్ల మంది అసంఘటిత రంగంలోనే ఉన్నారని, వీరికి ఎటువంటి పెన్షన్ లేదా ఇన్సూరెన్స్ వంటి సామాజిక భద్రత లేదని ఐ.ఎల్.ఓ హెచ్చరిస్తోంది. అలాగే 16 కోట్ల మంది బాల కార్మికులు ఉండటం మానవాళికి మాయని మచ్చగా మిగిలింది. నేడు ప్రపంచం నాలుగో పారిశ్రామిక విప్లవంలో ఉంది. కృత్రిమ మేధ, రోబోటిక్స్ వంటి సాంకేతికతలు ఉద్యోగాల స్వరూపాన్ని మార్చేస్తున్నాయి. 'గిగ్ ఎకానమీ' పేరుతో కొత్త రకం ఉపాధి మార్గాలు వస్తున్నాయి. ఇక్కడ కార్మికులకు, యజమానులకు మధ్య స్పష్టమైన నిర్వచనం లేకపోవడం వల్ల హక్కుల పరిరక్షణ క్లిష్టంగా మారింది. వలస కార్మికుల సమస్యలు, వాతావరణ మార్పుల వల్ల ఉపాధి కోల్పోతున్న వారి పరిస్థితి ఐ.ఎల్.ఓ ముందున్న ప్రస్తుత సవాళ్లు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని 'ఫ్యూచర్ ఆఫ్ వర్క్' పేరుతో ఐ.ఎల్.ఓ కొత్త కార్యాచరణను సిద్ధం చేస్తోంది. డిజిటల్ యుగంలో కూడా మానవీయ విలువలు మరుగవ్వకుండా చూడటమే ఈ సంస్థ తదుపరి లక్ష్యం. గత వంద ఏళ్లలో ఐ.ఎల్.ఓ సాధించిన విజయాలు అపారం. బానిసత్వం లాంటి పని పరిస్థితుల నుండి కార్మికులను విముక్తి చేయడంలో, మహిళలకు ప్రసూతి సెలవుల వంటి హక్కులు కల్పించడంలో, కనీస వేతన చట్టాలను అమలు చేయడంలో ఈ సంస్థ పాత్ర చిరస్మరణీయం. అయినప్పటికీ, ఇంకా పెరుగుతున్న ఆర్థిక అసమానతలు, నిరుద్యోగితా రేటును చూస్తే ఐ.ఎల్.ఓ ప్రయాణం ముగియలేదని అర్థమవుతుంది. ప్రతి మనిషికి గౌరవప్రదమైన పని, ప్రతి కార్మికుడికి సామాజిక న్యాయం దక్కిన రోజే ఐ.ఎల్.ఓ ఆశయం పరిపూర్ణమవుతుంది. శ్రామిక శక్తే ప్రపంచ సంపదకు మూలమని నమ్మి, ఆ శ్రమను గౌరవించే సమాజం కోసం ఈ అంతర్జాతీయ సంస్థ నిరంతరం కృషి చేస్తూనే ఉంటుంది.

# జన్యులోపమే పార్కిన్సన్‌కు మూలం



18వ శతాబ్దంలో జేమ్స్ పార్కిన్ సన్ అనే ఆంగ్లవైద్యుడు ఒళ్ళు ఒణుకు వ్యాధి అనే పేరుతో మొదట దీన్ని నిర్వచించిన కారణంగా పార్కిన్సన్స్ వ్యాధి అంటారు. ఈ వ్యాధి వేదకాలంలోనే ప్రస్తావించబడింది. ఆయుర్వేద సంహితలో అంటే ప్రాచీన భారతీయ వైద్యశాస్త్రంలో ఈ వ్యాధి, దాని లక్షణాలు, చికిత్స పేర్కొన బడ్డాయి. నాటి వైద్యశాస్త్ర నిపుణులు దీన్ని కంపవాత మన్నారు. 2500 సంవత్సరాలకు పూర్వమే నైజింగ్ అనే చైనా వైద్యశాస్త్రంలో దీని గురించిన ప్రస్తావన వుంది. కంపవాతం ఆయుర్వేద రీత్యా ఒక నరాల జబ్బు. ఈ వ్యాధి సోకిన మనిషి కదలికలో వ్యత్యాసం కనిపిస్తుంది. కూర్చొని, పడుకొని ఉన్నంతసేపూ బాగుంటాడు. కాని లేచి నిలబడి కదలబోతే శరీరం వణికి ఇటూ అటూ కదిలిపోతూ పడిపోతుంటాడు. పార్కిన్సన్ వ్యాధిని ఇప్పటికీ కారణం తెలియని వ్యాధిగానే పరిగణిస్తు న్నారు. జన్యుపరంగా, పర్యావరణ కారణాలవల్ల ఈ వ్యాధి వస్తుంది. పర్యావరణ కాలుష్యం విషపదార్థాలు, ఎరువులు, డ్రగ్స్ (యాంటీ సైకోటిక్, వాంతి వచ్చే మందులు) తయారీ, తరచుగా తలనొప్పి తదితర కారణాలతో పార్కిన్సన్ వ్యాధి ముడిపడి ఉంది. మెదడులో ఉత్పన్నమయ్యే డోపమైన్ కణాలు తగ్గిన పక్షంలో ఈ వ్యాధి వచ్చినట్టు నిర్ధారణ చేసుకోవచ్చు. ప్రొటీనోపతి (ప్రోటీన్లకు సంబంధించిన రుగ్మత) వల్ల పార్కిన్సన్ వ్యాధివచ్చే అవకాశముంది. పార్కిన్సన్ వ్యాధి సర్వసాధారణ వ్యాధి. ఇది సమాజంలో ప్రబలంగా ఉంది. 60 ఏళ్లు దాటిన వయోవృద్ధులకు ఇది వస్తుంది. దీన్ని వృద్ధాప్యంలో వచ్చే అంగవైకల్య వ్యాధిగా పరిగణిస్తారు. "వణుకుడు రోగం" లేక "పార్కిన్సన్స్ వ్యాధి" నాడీ కణాలను (నరాల కణాలను) దెబ్బ తీయడం ద్వారా ప్రగతిశీల మెదడు దెబ్బకు దారితీస్తుంది. 'డోపమైన్' అని పలవబడే న్యూరోట్రాన్స్మిటర్ ద్వారా మెదడు అంతటా సంకేతాలు ప్రసరించే బాధ్యత ఈ నాడీ కణాలదే. సాధారణ పరిస్థితులలో, మృదువైన, సమతుల్య కండరాల సమన్వయాన్ని డోపమైన్ సహాయంతో సాధించవచ్చు. ఈ డోపామైన్ అనే ఈ న్యూరోట్రాన్స్మిటర్ లేకపోవడం మూలంగానే "పార్కిన్సన్స్ వ్యాధి" లేక వణుకుడు రోగం మనుషుల్లో సంభవిస్తుంది. పార్కిన్సన్స్ వ్యాధి యొక్క ప్రారంభ మరియు అత్యంత సాధారణ లక్షణాలు శరీరంలోని అవయవాల్లోని ఎదో ఒక భాగంలో... చేతులు లేదా కాళ్ళు లేదా దవడ లోనైనా, వణుకుడు రావడం. చేయి విశ్రాంతి దశలో ఉన్నప్పుడు ప్రకంపన లేదా వణుకు సాధారణంగా గుర్తించ బడుతుంది, సాధారణంగా చూపుడు వేలుకు వ్యతిరేకంగా బొటనవేలు యొక్క కదలికను చూడవచ్చు. దీని రెండవ లక్షణం సాధారణంగా కండరాల పెడసరం లేదా కండరాలు బిగదీయడం. మనిషి స్వేచ్ఛా చలన వలయాల్ని కుంటుపరుస్తూ (పరిమితం చేస్తూ) అనియంత్రితమైన కండరాల పెడసరం లేక కండరాలు పట్టేయడ మనేది వణుకుడు వ్యాధి లక్షణం. వ్యాధికి గురైన వ్యక్తులు చేపట్టిన ఏదైనా పనియొక్క వేగంలో క్రమమైన తగ్గుదలను చూపుతారు. స్నానం లేదా తినడం వంటి సాధారణ కార్యకలాపాల్ని పూర్తి చేయడంలో కూడా వీళ్ళు అసాధారణంగా ఎక్కువసేపు తీసుకోవాల్సి వస్తుంది.సాపేక్షంగా అరుదుగా ఉండే లక్షణాలలో భయము, చొంగ కార్చడం, చర్మ సమస్యలు, మూత్ర సమస్యలు, లైంగిక అసమర్థత ఉంటాయి. వ్యాధి బాధితుడి వణుకుడు గణనీయంగా సదరు వ్యక్తి మాటల్ని మరియు చేతివ్రాతను దెబ్బ తీస్తుంది. వణుకుడు రోగానికి సంభావ్య కారణాలను గుర్తించడానికి పరిశోధన కొనసాగుతున్నప్పటికీ, అదిప్పటికీ తెలియదు. జన్యు కారకాలు మరియు కొన్ని పర్యావరణ పరిస్థితుల్ని వణుకుడు జబ్బుకు ప్రమాద కారకాలుగా భావిస్తారు. పార్కిన్సన్స్ వ్యాధిని అభివృద్ధి చేయడంలో జన్యు పరివర్తనలు ప్రమాద కారకంగా గుర్తించబడ్డాయి, యాంటిసైకోటిక్ ఔషధాలను సేవించే వ్యక్తులు లేదా మెదడు అనారోగ్యంతో బాధపడుతున్న వారిలో లేదా గతంలో స్ట్రోక్ లకు గురై బాధపడుతున్న వ్యక్తులకు వణుకుడు రోగం సంభవించ వచ్చునని భావించ బడుతోంది. పరిస్థితిని నిర్ధారించడానికి నిర్దిష్ట రక్తం లేదా ప్రయోగశాల పరిశోధన లేనందున పార్కిన్సన్స్ వ్యాధి నిర్ధారణను గందరగోళంగా చెప్పవచ్చు. అంతే కాకుండా, లక్షణాలు తరచూ కీళ్ళ అసాధారణతలు లేదా విటమిన్ లోపాల వంటి ఇతర రుగ్మతలను అనుకరిస్తాయి. ఒక అర్హత కలిగిన న్యూరాలజిస్ట్ తో సలహా, సంప్రదింపులు తీసుకోవాలి. ఈ న్యూరాలజిస్ట్ కొంతకాలం పాటు లక్షణాలను పరిశీలించి, వ్యాధి పురోగతిని ఆపడమే లేక నియంత్రించడమో చేయగలరు. చికిత్సకు సంబంధించినంత వరకు, 'డోపమైన్' లోప పరిస్థితికి వివిధ రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. ఈ మందులు వ్యాధికి గురైన మెదడు బాగాలను ప్రేరేపించడం ద్వారా పని చేస్తాయి. అయితే, దీర్ఘకాలిక దశలో, ఈ మందులు దుష్ప్రభావాలను చూపుతాయి. మందులు వ్యాధి లక్షణాలను నియంత్రించ లేకుంటే, శస్త్రచికిత్స అవసరం కావచ్చు. మెదడును ప్రేరేపించటానికి ఎలక్ట్రోడ్లు ఉపయోగించడం ఇందులో జరుగుతుంది, ఇలా చేయడం ద్వారా వణుకుడ్ని ప్రేరేపించడానికి దారితీసే ప్రేరణల్ని అడ్డుకోవడం జరుగుతుంది. పార్కిన్సన్స్ వ్యాధి ఒక ప్రగతిశీల రుగ్మత. ఈ రుగ్మతకు ఖచ్చితమైన నివారణ లేదు. మానసిక ఆరోగ్యాన్ని, శారీరక చర్యల్ని చేపట్టే సామర్థ్యాన్ని కాపాడు కోవడమే ఈ వ్యాధితో బాధపడుతున్న వ్యక్తుల దీర్ఘకాలిక లక్ష్యాలుగా ఉండాలి.

# డ్రంక్ అండ్ డ్రైవ్‌పై కట్టుదిట్టమైన చర్యలు

**అగ్నిధార న్యూస్ ,(రామగుండం):**

రోడ్డు భద్రతను పెంపొందించేందుకు గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, ఎస్సై రమేష్ ఆధ్వర్యంలో ప్రధాన రహదారులు, జంక్షన్లు, రద్దీ ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న పలువురిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేశారు.

బ్రీత్ అనలైజర్ పరికరాల సహాయంతో డ్రైవర్లను పరీక్షించి, నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై చట్టపరమైన చర్యలు తీసుకున్నారు. అవసరమైన చోట వాహనాలను సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. మద్యం సేవించిన తర్వాత వాహనాలు నడపడం ప్రమాదకరమని, ఇది ప్రాణాపాయ పరిస్థితులకు దారి తీస్తుందని హెచ్చరించారు. ప్రజలు రోడ్డు భద్రత నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.



## రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన నరేందర్ రెడ్డికి అభినందనలు




**అగ్నిధార న్యూస్ ,(హైదరాబాద్):**

రాజ్యసభ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన శ్రీ వేం నరేందర్ రెడ్డిని దసపల్లా హోటల్‌లో ఏర్పాటు చేసిన విందులో ఘనంగా సన్మానించారు. తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్ డా. జి. జనక్ ప్రసాద్ పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డిని పూలమాలలతో సత్కరించి అభినందించారు. రాష్ట్ర అభివృద్ధికి ఆయన కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రంలోని వివిధ శాఖల చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణకు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్

**అగ్ని ధార న్యూస్ ,(మంచిర్యాల):**

నేరాల నియంత్రణ, ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు సీసీసీ నస్పూర్ పోలీసుల ఆధ్వర్యంలో సోనియా నగర్, శ్యామ్ నగర్ ప్రాంతాల్లో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంచిర్యాల ఏసీపీ ఆర్. ప్రకాష్, రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి. రవీందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ, వేసవి సెలవుల సమయంలో ప్రజలు ఇళ్లకు తాళం వేసి వెళ్లే సందర్భాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విలువైన వస్తువులను ఇళ్లలో ఉంచకుండా జాగ్రత్తలు పాటించాలని, ప్రతి కాలనీలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో భాగంగా వాహన తనిఖీలు నిర్వహించి సరైన పత్రాలు లేని 60 వాహనాలు, 7 ఆటోలకు జరిమానాలు విధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఎం. ప్రశాంత్, హాజీపూర్, శ్రీరాంపూర్ ఉమెన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది, సీసీసీ నస్పూర్ పోలీసులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## జానంపేటలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ

**ఏజెన్సీ ఎస్సీల హక్కుల కోసం కృషి చేస్తాం ఎమ్మెల్యే**

**అగ్ని ధార న్యూస్ ,(పినపాక):**

పినపాక నియోజకవర్గంలోని జానంపేటలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షులు బొమ్మెర శ్రీనివాస్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎస్సీ కులాలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను ఏజెన్సీ ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో అమలు చేయాలని జేఏసీ నాయకులు ఎమ్మెల్యేను కోరారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఏజెన్సీ ప్రాంత ఎస్సీ కులాల స్థానిక హక్కుల సాధనకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో విగ్రహ నిర్వహణ కమిటీ అధ్యక్షులు కుమ్మరి వెంకటేశ్వర్లు, సభాధ్యక్షులు గొల్లపాటి వెంకటేశ్వర్లు, జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ గోద రమేష్, జిల్లా నాయకులు కర్లపూడి సందర్భాలు, వల్లపాక నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 17న ఎస్సీ హక్కుల జేఏసీ జిల్లా సమావేశం

**ఐక్యంగా పోరాడాలని పిలుపు**

**అగ్ని ధార న్యూస్ ,(కొత్తగూడెం):**

షెడ్యూల్డ్ కులాల హక్కుల సాధన కోసం ఈనెల 17న జిల్లా స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు జేఏసీ రాష్ట్ర కోఆర్డినేటర్ పెనగంటి కృపాకర్ తెలిపారు. శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన ఈ వివరాలు వెల్లడించారు. కొత్తగూడెంలోని అంబేద్కర్ కమ్యూనిటీ హాల్‌లో ఉదయం 11 గంటలకు సమావేశం జరుగుతుందని, ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి సమీక్షతో పాటు భవిష్యత్ కార్యాచరణపై చర్చిస్తామని తెలిపారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఏజెన్సీ ప్రాంతాల్లో స్థానిక ఎస్సీల రిజర్వేషన్లు తగ్గడంతో అన్యాయం జరిగిందని, దీనిపై అందరూ ఐక్యంగా పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షులు బొమ్మెర శ్రీనివాస్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోద రమేష్, సింగరేణి రిటైర్డ్ జీఎం ఎస్ వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు, కన్వీనర్లు, కో-కన్వీనర్లు, సామాజిక ఉద్యమకారులు, మేధావులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## నేరాల నియంత్రణకు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్

**అగ్ని ధార న్యూస్ ,(మంచిర్యాల):**

నేరాల నియంత్రణ, ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు సీసీసీ నస్పూర్ పోలీసుల ఆధ్వర్యంలో సోనియా నగర్, శ్యామ్ నగర్ ప్రాంతాల్లో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంచిర్యాల ఏసీపీ ఆర్. ప్రకాష్, రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి. రవీందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ, వేసవి సెలవుల సమయంలో ప్రజలు ఇళ్లకు తాళం వేసి వెళ్లే సందర్భాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విలువైన వస్తువులను ఇళ్లలో ఉంచకుండా జాగ్రత్తలు పాటించాలని, ప్రతి కాలనీలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో భాగంగా వాహన తనిఖీలు నిర్వహించి సరైన పత్రాలు లేని 60 వాహనాలు, 7 ఆటోలకు జరిమానాలు విధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఎం. ప్రశాంత్, హాజీపూర్, శ్రీరాంపూర్ ఉమెన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది, సీసీసీ నస్పూర్ పోలీసులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలి




**అగ్ని ధార న్యూస్ ,(పెద్దపల్లి):**

విద్యుత్ రంగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మల్యాలపల్లి సబ్‌స్టేషన్ వద్ద ఆర్టిజన్ కార్మికులు నిర్వహించిన నిరసన కార్యక్రమానికి వెళ్లి వారు సంఘీభావం తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలో విద్యుత్ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, వారిని ఆర్టిజన్లుగా మార్చే స్టాండింగ్ రూల్స్ తీసుకురావడాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు ఈ నెల 8 నుంచి సమ్మె చేస్తున్నారని తెలిపారు. ఈ సమ్మెకు ఐఎఫ్‌టీయూ, టీయూసీఐ, ఏఐఎఫ్‌టీయూ సంఘాలు సంపూర్ణ మద్దతు ప్రకటించినట్లు నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 23 వేల మంది విద్యుత్ కార్మికులు సమ్మెలో పాల్గొంటున్నారని, వారి సమస్యలను ప్రభుత్వం అత్యవసరంగా పరిష్కరించాలని కోరారు. వేసవి కాలంలో విద్యుత్ డిమాండ్ అధికంగా ఉండే సమయంలో కార్మికులు సమ్మెకు దిగడం రాష్ట్రానికి నష్టకరమని పేర్కొన్నారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిగణించి, రెగ్యులర్ కార్మికులకు వర్తించే విధంగా నిబంధనలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఇతర రంగాల కార్మికులను కూడా ఉద్యమంలో భాగం చేస్తామని హెచ్చరించారు. కార్మిక వ్యతిరేక విధానాలను ప్రభుత్వం విరమించుకోవాలని, ఐక్య పోరాటాల ద్వారానే సమస్యలకు పరిష్కారం సాధ్యమని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు కలవల రాయమల్లు, ధర్మాజీ నరసయ్య తదితరులతో పాటు ఆర్టిజన్ కార్మికులు పాల్గొన్నారు

## తిరుమలగిరి గ్రంథాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీగణేష్

**సికింద్రాబాద్ :** నేటి తరానికి జ్ఞానాన్ని సమకూర్చేందుకు గ్రంథాలయాల ఆవశ్యకత ఎంతైనా ఉందని కంటోన్మెంట్ శాసనసభ్యులు శ్రీ గణేష్ అన్నారు. తిరుమలగిరి లాల్ బజార్ లో రాష్ట్ర ప్రభుత్వ నిధులతో నూతనంగా నిర్మించిన గ్రంథాలయాన్ని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ ప్రారంభించారు. కోటి యాభై లక్షల రూపాయల నిధులతో గ్రంథాలయాన్ని నిర్మించి విద్యార్థులకు యువతకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ మాట్లాడుతూ గ్రంథాలయం మూలంగా వచ్చే సమాచార సేకరణ, విషయ పరిజ్ఞానం యువతకు విద్యార్థులకు ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలో బోయిన్ పల్లి, బొల్లారంలో సైతం గ్రంథాలయ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. గ్రంథాలయంలో అన్ని రకాల వసతులు కల్పించామని విద్యార్థులు ఈ సదవకాశాన్ని వినియోగించుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

# విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల సమ్మెకు బీజేపీ మద్దతు



**డిమాండ్లు నెరవేర్చకపోతే ఉద్యమం ఉధృతం చేస్తాం**

**అగ్నిధార న్యూస్ ,(రామగుండం):**

విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల నిరవధిక సమ్మెకు బీజేపీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. మల్యాలపల్లి సబ్‌స్టేషన్ వద్ద తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ల జేఏసీ చేపట్టిన సమ్మె మూడో రోజుకు చేరిన సందర్భంగా బీజేపీ రామగుండం ఇంచార్జి కందుల సంధ్యారాణి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా సుమారు 20 వేల మంది ఆర్టిజన్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేస్తున్న కార్మికులను పాత ఏపీఎస్ఈబీ నిబంధనల ప్రకారం క్రమబద్ధీకరించాలని, వారిని ద్వితీయ శ్రేణి కార్మికులుగా చూడటం రాజ్యాంగ విరుద్ధమని మండిపడ్డారు. గతంలో విద్యార్హతల ఆధారంగా కన్వర్షన్ ప్రక్రియ అమలు చేసిన ప్రభుత్వం, ప్రస్తుతం కార్మికుల పట్ల నిర్లక్ష్య వైఖరి అవలంబించడం అన్యాయమని పేర్కొన్నారు. 12(3) ఒప్పందం ప్రకారం తక్షణమే ఉత్తర్వులు జారీ చేసి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఒకే సంస్థలో రెండు విధాల నిబంధనలు అమలు చేయడం సరికాదని, సమాన పనికి సమాన గౌరవం కల్పించాలని కోరారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే అసెంబ్లీ నుంచి సచివాలయం వరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గుండబోయిన భూమయ్య, అంకరి భరత్, పరకాల మురళి, బండారి శ్యామ్ పటేల్, చిలువేరు కుమార్, జక్కన బాలు, శిలారపు కళ్యాణ్, వెంకటేష్, ఏరుకొండ తిరుపతి, అల్చేరి గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రాల ఏర్పాటుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలి

**అగ్ని ధార న్యూస్ ,(రామగుండం):**

వేసవి దృష్ట్యా నగరంలో అవసరమైన ప్రాంతాల్లో చలివేంద్రాల ఏర్పాటు కోసం స్వచ్ఛంద సంస్థలు, వివిధ అసోసియేషన్లు చొరవ తీసుకోవాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణశ్రీ పిలుపునిచ్చారు. శుక్రవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో వార్డు అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎవరూ ముందుకు రాని ప్రాంతాల్లో నగర పాలక సంస్థ ఆధ్వర్యంలోనే చలివేంద్రాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. చలివేంద్రాల అవసరం ఉన్న ప్రాంతాలను గుర్తించి వెంటనే జాబితా అందించాలని అధికారులను ఆదేశించారు. అస్తిపన్ను వసూళ్లపై కూడా దృష్టి సారించాలని సూచిస్తూ, ఏప్రిల్ 30లోపు పన్ను చెల్లించిన వారికి ఐదు శాతం రాయితీ ఉన్న విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేసి వసూళ్లు పెంచాలని తెలిపారు. నగర హరితీకరణలో భాగంగా మొక్కలు నాటడానికి అనువైన ప్రదేశాల జాబితాను సిద్ధం చేయాలని, ఇందిరమ్మ పథకం లబ్ధిదారులను చైతన్యపరచి ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని సూచించారు. స్థలాలు కేటాయించుకున్న లబ్ధిదారులను ఎల్-2 నుంచి ఎల్-1 కేటగిరీలో చేర్చే చర్యలు చేపట్టాలని అన్నారు. అదేవిధంగా జనగణన హెచ్ఎల్‌బీ ప్రక్రియను పూర్తి చేయాలని, అమృతం యాప్‌లో నల్లా కనెక్షన్ వివరాలను అప్లోడ్ చేయాలని, శానిటేషన్ సిబ్బంది హాజరును క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి, ఎస్ఈ గురువీర, ఈఈ రామన్, అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఏసీపీ శ్రీహరి, వార్డు అధికారులు పాల్గొన్నారు

# సర్వే నెం.59 భూములపై సర్వే నిర్వహణ

**పట్టాలు మంజూరు చేయాలని రైతుల డిమాండ్**

**అన్నదార న్యూస్ ,(మంథని):**

ముత్తారం మండలం పోతారం గ్రామంలో సర్వే నెంబర్ 59కు చెందిన భూములపై ప్రభుత్వ అధికారులు శుక్రవారం సర్వే నిర్వహించారు. ఈ భూములపై అక్రమ పట్టాలు జరిగాయని, నిజమైన సాగుదారులకు హక్కులు కల్పించాలని గ్రామస్తులు అధికారులను కోరారు. గ్రామానికి చెందిన రైతులు, దళిత నాయకులు తెలిపిన వివరాల ప్రకారం, గత 80 ఏళ్లుగా తమ తాతల కాలం నుంచే ఈ భూములను సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. అయితే కొందరు అపరిచితులు అక్రమంగా పట్టాలు పొందడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి పొందుతున్నారని ఆరోపించారు. ఈ విషయంపై ఇప్పటికే జిల్లా కలెక్టర్, మండల ఎమ్మార్వోలకు వినతిపత్రాలు సమర్పించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో అధికారులచే సర్వే నిర్వహించడాన్ని స్వాగతిస్తూ, నిజమైన సాగుదారులకు పట్టాలు మంజూరు చేయాలని కోరారు. సర్వే



కార్యక్రమంలో పాల్గొన్న ఆర్ఐ, రెవెన్యూ సిబ్బంది, గ్రామ పెద్దలు, నాయకులకు మంథని డివిజన్ దళిత నాయకుడు ఊట్ల శ్రీను కృతజ్ఞతలు తెలిపారు.

# మెరుపుల మాయలో పెట్టుబడులు... భూమితోనే భరోసా!

**గంగవరం రామకృష్ణారెడ్డి**
**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా :**

ఈ రోజుల్లో పెట్టుబడుల ప్రపంచం మెరుపులతో నిండిపోయింది. ప్రకటనలు, డిస్కౌంట్లు, తక్షణ లాభాల వాగ్దానాలు---ఇవి ప్రజలను ఆకర్షిస్తున్నాయి. కానీ ఈ ఆకర్షణల వెనుక దాగి ఉన్న ప్రమాదాలను గుర్తించడంలో చాలా మంది విఫలమవుతున్నారు. గోల్డ్ కొనుగోలు విషయంలో నాణ్యతపై అనుమానాలు, షేర్ మార్కెట్‌లో అనిశ్చితి, కార్పొరేట్ షాపింగ్ మాల్స్‌లో హంగు హర్బాటాల మధ్య దాగి ఉన్న వ్యాపార తంత్రాలు---ఇవి సాధారణ వినియోగదారుని అయోమయంలోకి నెడుతున్నాయి. బయట కనిపించే కవర్ ఎంత ఆకర్షణీయంగా ఉన్నా, లోపల ఉన్న కంటెంట్ అదే స్థాయిలో ఉండాలనే హామీ లేదు. ఇలాంటి పరిస్థితుల్లో, ఒక శాశ్వత సత్యం మన ముందుకొస్తుంది,భూమి ఎప్పుడూ భరోసాగా మనకు నిలబడుతుంది. రియల్ ఎస్టేట్ ఒక స్థిరమైన ఆస్తి. కాలంతో పాటు దాని విలువ పెరుగుతుంది. ఊహాగానాలకు కాదు, భద్రతకు ప్రతీకగా నిలుస్తుంది. పెట్టుబడుల విషయంలో అతి ఆశ ప్రమాదకరం. తక్కువ సమయంలో ఎక్కువ లాభం పొందాలనే ఆలోచన చాలా సార్లు నష్టాలకు దారితీస్తుంది. షేర్ మార్కెట్‌లో అనుభవం లేకుండా ప్రవేశించడం, గోల్డ్‌లో నాణ్యతను నిర్ధారించకపోవడం---ఇవి ఆర్థిక స్థిరత్వాన్ని దెబ్బతీస్తాయి. అందుకే సేఫ్టీ సేవింగ్స్, స్థిర పెట్టుబడులు ప్రజలకు మరింత రక్షణను అందిస్తాయి. కార్పొరేట్ షాపింగ్ సంస్కృతి మరో ఆందోళనకర అంశం. మెరిసే లైట్లు, భారీ ఆఫర్లు, ఆకర్షణీయమైన ప్రదర్శనలు---ఇవి కస్టమర్లను ఆకర్షించడానికి ఉపయోగించే సాధనాలు మాత్రమే. కానీ నాణ్యత, న్యాయమైన ధరలు అనేవి చాలా సార్లు ప్రశ్నార్థకంగా మారుతున్నాయి. ఇదే సమయంలో, చిన్న బడ్జెట్ షాపులు నమ్మకాన్ని మూలధనంగా తీసుకుని ముందుకు సాగుతున్నాయి. అక్కడ హంగులు తక్కువైనా, నిజాయితీ ఎక్కువగా ఉంటుంది. కస్టమర్‌తో ఉన్న నమ్మకమే వారి బలం. ఈ నేపథ్యంలో ప్రజలు తీసుకోవాల్సిన నిర్ణయం స్పష్టంగా ఉంది,మెరుపులకు లోనవకుండా, నిజాన్ని గుర్తించాలి.తక్షణ లాభాల కంటే, దీర్ఘకాల భద్రతను ఎంచుకోవాలి. ఆకర్షణల కంటే, ఆస్తి



విలువను అంచనా వేయాలి. సంపద అనేది కేవలం సంపాదన కాదు; అది నమ్మకం, భద్రత, స్థిరత్వం కలయిక.అవి ఉన్న చోటే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది.

# కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారానే బడుగు బలహీన వర్గాలకు న్యాయం

**కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి**
**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

కల్వకుర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మండలశీ లోని 30 లబ్ధి దారులకు కళ్యాణ లక్ష్మి చెక్కుల తో పాటు మున్సిపాలిటీ కి చెందిన 40 మందికి ముఖ్య మంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అంగన్వాడీ ఉద్యోగులకు సెల్ ఫోన్ లు అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరై లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వంలోనే బడుగు బలహీనవర్గాలకు న్యాయం జరుగుతుంది అని వారికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండ గా ఉంటుంది అని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో, పిసిసి అధికార ప్రతినిధి బాలాజీ సింగ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆనంద్ కుమార్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి , చిమ్ముల శ్రీకాంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల



అధ్యక్షుడు బెక్కెర బాల్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు పుస్తకాల రాహుల్ , కౌన్సిలర్ రమాకాంత్ రెడ్డి, మండలశీ లోని అన్ని గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు స్థానిక ప్రజా ప్రతి నిధులు మహిళలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారానే బడుగు బలహీన వర్గాలకు న్యాయం

**ప్రజా ప్రభుత్వంలోనే అందరికి సంక్షేమ పథకాలు**
**కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి**
**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

తలకొండపల్లి మండల పరిధిలోని దేవికి గార్డెన్లో కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరై లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసి రెడ్డి నారాయణ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వంలోనే బడుగు బలహీనవర్గాలకు న్యాయం జరుగుతుంది అని వారికి కాంగ్రెస్ పార్టీ ఎల్లపుడూ అండగా ఉంటుంది అని ఆయన అన్నారు.అనంతరం గ్రామ సర్పంచ్ శేఖర్ యాదవ్, ఉపసర్పంచ్ నూకం కోటీశ్వర్ ముదిరాజ్ సహా పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో ముందంజలో ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన కళ్యాణ లక్ష్మి -- షాదీ ముబారక్ పథకాన్ని ప్రస్తుత ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి సజావుగా కొనసాగించడం అభినందనీయమని ప్రశంసిస్తూ పలు అంశాలను లేవనెత్తారు.ఈ పథకం పేద కుటుంబాల ఆర్థిక భారం తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తోందని అభిప్రాయపడ్డారు. అదేవిధంగా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ కళ్యాణ లక్ష్మి పథకంతో పాటు తులం బంగారం అందించే అంశాన్ని



ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు పారదర్శకంగా మంజూరు చేయాలని కోరారు.మండల అభివృద్ధికి సంబంధించిన పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.తలకొండపల్లి మండలంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు అవసరాన్ని ప్రస్తావించారు.అలాగే వ్యవసాయ క్షేత్రాల్లో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లను గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని, అవసరమైన సామాగ్రి అందించాలని కోరారు.గ్రామంలోని సీసీ రోడ్ల మరమ్మతులు కూడా అత్యవసరమని, సమస్యల పరిష్కారానికి సమగ్ర ప్రణాళిక రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. రాజకీయ విభేదాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలని, కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు మహిళలు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో, పిసిసి అధికార ప్రతినిధి బాలాజీ సింగ్, మార్కెట్ కమిటీ చైర్మన్ యట గీత నరసింహా,వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి,మార్కెట్ డైరక్టర్ చల్లా వేంకట్ రాంరెడ్డి, అంజయ్య గుప్త,శ్యామ్ సుందర్ రెడ్డి, సర్పంచ్ గుజ్జుల లక్ష్మమ్మ, మాజీ ఉప సర్పంచ్ అజీజ్,కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# ప్రజా ప్రభుత్వంలో ప్రజలందరికి సంక్షేమ పథకాలు

**ఎమ్మెల్యే సహకారంతో లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసిన సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి**
**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

తలకొండపల్లి మండలం లింగరావుపల్లి గ్రామంలో సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా గ్రామానికి చెందిన 1)కాల్లా నందిని 2)టేకురి అనూష 3)బొచ్చుపల్లి ఆశ్విని 4)బక్కి మమతా లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులు అందజేశారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు న్యాయం జరుగుతుంది అని ఆయన అన్నారు.అనంతరం ఎమ్మెల్యే కసి రెడ్డి నారాయణ రెడ్డి కి ధన్యవాదాలు తెలిపారు కార్యక్రమంలో, గ్రామ సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డీ , మాజీ సర్పంచ్ జినుకుంట్ల శ్రీనివాస్, బొచ్చుపల్లి రాములు ,రబ్బానీ, బొచ్చుపల్లి శ్రీను, సాయిలు, జంగమ్మ, చెన్నమ్మ, లక్ష్మమ, గ్రామ సిబ్బంది పాల్గొన్నారు.



## విశ్వబ్రాహ్మణ హక్కుల కోసం పోరాటం



**ఐక్య సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు చెల్లోజు రాజు**
**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి,ఏప్రిల్ 10:(కమాన్ రోడ్ ప్రెస్ క్లబ్ న్యూస్)**

విశ్వబ్రాహ్మణుల హక్కుల సాధన కోసం ప్రభుత్వంపై రాజీలేని పోరాటం చేస్తామని విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు చెల్లోజు రాజు స్పష్టం చేశారు. శుక్రవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని కమాన్ రోడ్ ప్రెస్ క్లబ్ లో జిల్లా అధ్యక్షుడు భీమోజు సురేందర్ చారి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో చెల్లోజు రాజు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ఆత్మార్పణలు చేసుకున్న చరిత్ర విశ్వబ్రాహ్మణులదని,కానీ గత పాలకులు తమను కేవలం ఓటు బ్యాంకుగా చూసి మోసం చేశారని మండిపడ్డారు.ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై తమకు నమ్మకం ఉందని,అయితే అధికారంలోకి వచ్చి ఇన్నాళ్లవుతున్నా తమ ప్రధాన డిమాండ్ అయిన విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటుపై స్పష్టత ఇవ్వకపోవడం విచారకరమన్నారు. తక్షణమే కార్పొరేషన్ ఏర్పాటు చేసి,నిధులు కేటాయించడంతో పాటు పాలక మండలిని నియమించాలని డిమాండ్ చేశారు.అనంతరం సంఘం బలోపేతంపై మాట్లాడుతూ 2021నుండి రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతున్న ఎర్రోజు భిక్షపతి ఐదేళ్ల పదవీ కాలం ముగిసిన నేపథ్యంలో,రాష్ట్రంలోని 26 జిల్లాల అధ్యక్షులు,మండల కమిటీల సిఫార్సు మేరకు ఆయనను తిరిగి రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు.కొత్తగా ఎన్నికలు నిర్వహించే వరకు ప్రస్తుత జిల్లా,మండల కమిటీలే యథావిధిగా కొనసాగుతాయని స్పష్టం చేశారు.త్వరలోనే రాష్ట్ర అధ్యక్షుడి పిలుపు మేరకు అన్ని జిల్లా కలెక్టరేట్ల ముట్టడి,రాస్తారోకోలు వంటి ఉధృత పోరాటాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు.విశ్వకర్మలందరూ విభేదాలు పక్కనపెట్టి, ఐక్యంగా ఉండి తమ హక్కులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు భీమోజు సురేందర్ చారి,పట్టణ అధ్యక్షుడు నాగుల మల్యాల ప్రసాద్,జిల్లా,మండల కమిటీల ప్రతినిధులు అబ్బోజు కోటయ్య,నూతి రవీంద్ర చారి,ఎర్రోజు వీరస్వామి,అక్కనపల్లి కుమార్ తోపాటు సంఘం నాయకులు పాల్గొన్నారు.

## 765 కె విహైటెన్షన్ లైన్ల బాధిత రైతులకు న్యాయం చేయాలి



**కడ్తాల్ రైతులతో కలిసి జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత**
**మాజీ ఎమ్మెల్యేలు జైపాల్ యాదవ్, అంజయ్య యాదవ్, మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి**
**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

రైతుల పొలాల గుండా 765 ఖ౦ హైటెన్షన్ విద్యుత్ స్తంభాలు, తీగలు వేయడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని మాజీ ఎమ్మెల్యేలు జైపాల్ యాదవ్, అంజయ్య యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. కడ్తాల్, కేశంపేట్ మండలాల్లోని పలు గ్రామాల మీదుగా వెళ్తున్న 765 కె విబీదర్ – మహేశ్వరం' నూతన విద్యుత్ లైన్‌తో తలెత్తుతున్న సమస్యలపై శుక్రవారం వారు రంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్ చంద్రారెడ్డికి వినతిపత్రం అందజేశారు. సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, ఇతర రైతులతో కలిసి కలెక్టర్ కార్యాలయంలో జేసీకి పరిస్థితిని వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హైటెన్షన్ విద్యుత్ లైన్ల ఏర్పాటు వల్ల వ్యవసాయ భూముల వినియోగంపై, పంటల ఉత్పత్తిపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుందన్నారు. రైతులు తమ పొలాలను సాగు చేసుకోలేకపోవడమే కాకుండా, క్రయవిక్రయాలకు కూడా వీలులేకుండా పోయి తీవ్రంగా నష్టపోతున్నారని వివరించారు. అలాగే శరవేగంగా అభివృద్ధి చెందుతున్న కడ్తాల్ మండల కేంద్రానికి సమీపంలో ఈ లైన్ల ఏర్పాటు వల్ల ఆ ప్రాంత అభివృద్ధి కుంటుపడుతుందని తెలిపారు. బాధిత రైతులకు న్యాయం జరిగేంతవరకు వారి పక్షాన పోరాడతామని, అవసరమైతే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని నాయకులు స్పష్టం చేశారు. కాగా, రైతులకు న్యాయం జరిగేలా తగిన చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కడ్తాల్ మాజీ ఉప సర్పంచ్ కదారి రామకృష్ణ, గుదే రాములు యాదవ్, గూడూరు జంగారెడ్డి, గూడూరు పెంటారెడ్డి, కందికంటి శ్రీరాములు, గుదే పర్వత్ కుమార్ యాదవ్, గిరి యాదవ్, గోరేటి శ్రీశైలం, గోరేటి చంద్రశేఖర్, జంగయ్య, యాదయ్య, కేశవులు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల ఆరోగ్య సంక్షేమామే ప్రభుత్వ లక్ష్యం



**సర్పంచి మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు**
**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

వెల్దశీడ .మండల కేంద్రంలోని వెల్దండ సబ్-సెంటర్ పరిధిలో ఎన్ సి డి అంటు వ్యాధులు కాని వ్యాధులు స్క్రీనింగ్ కార్యక్రమాన్ని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సింధు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు.ముఖ్య అతిధులుగా గ్రామ సర్పంచి మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ పాల్గొని మాట్లాడుతూ బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి తగిన చికిత్స చేస్తారని, మందులు ప్రభుత్వమే ఉచితంగా అందిస్తున్నారని తెలిపారు ప్రజల ఆరోగ్యశీ పై డాక్టర్ లు పని చేస్తున్నారని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ రాధ, పర్యవేక్షకులు మురళీ కృష్ణ, మనోజ్ కుమార్, వార్డు సభ్యులు గుద్దటి కిష్టల్, ముదికొండ కవిత రమేష్,పిల్లి దేవేందర్, ఆరోగ్య కార్యకర్త జహంగీర్ బీ,ఆశా కార్యకర్తలు యాదమ్మ,సుజాత, అనిత,పద్మ తదితరులు పాల్గొన్నారు.

# భారత కార్మిక ఉద్యమ నాయకురాలు విమల రణదీవే వర్ధంతి

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

కల్వకుర్తి పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో సిఐటియు ఆధ్వర్యంలో ప్రముఖ కార్మిక ఉద్యమ నాయకురాలు విమల రనదివే 111వ జయంతి ఘనంగా నిర్వహించారు. విమల రణ దీవె చిత్రపటానికి పూలమాలవేసి పలు ప్రజాసంఘాల నాయకులు పూలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు బి. ఆంజనేయులు మాట్లాడుతూ 10 ఏప్రిల్ 1915లో మహారాష్ట్ర లో మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన విమల స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్నారు. ఆమె 12 సంవత్సరాల వయసులోనే జాతీయ ఉద్యమం పట్ల ఆకర్షితురాలై కాంగ్రెస్ సేవాదళ్ వాలంటీర్గా పనిచేశారని 1930లో గాంధీజీ పిలుపుమేరకు సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొని జైలుకెల్లారని అన్నారు. కలకత్తాలో సిఐటియు ప్లాంటేషన్ వర్కర్స్ ఫెడరేషన్ ఏర్పడి నప్పుడు మొట్టమొదటి ప్రధాన కార్యదర్శిగా అయ్యారని టి తోటల కార్మికుల సమస్యల పైన మిల్లు వర్కర్స్ సమస్యలపై పోరాడారు. అదేవిధంగా శ్రామిక మహిళలను ప్రత్యేకంగా ఆర్గనైజ్ చేయాలని సిఐటియు తీసుకున్న నిర్ణయం ప్రకారం 1979లో మద్రాసులో శ్రామిక మహిళల మొదటి సదస్సులో అఖిలభారత శ్రామిక మహిళా సమన్వయ కమిటీ కార్యదర్శిగా ఎన్నికైనరని లైంగిక మరియు వర్గ సమస్యల ను అనుసంధానం చేసి ఉద్యమంలో సమతుల్యత పాటిస్తూ అనేక ఐక్య ఉద్యమాలను నడిపిస్తూ



దేశంలోనే కాగా వివిధ దేశాలలో జరిగిన సెమినార్లు సదస్సులలో పాల్గొని ప్రసంగించారని, 1987లో సిఐటియు కార్యదర్శిగా అదేవిధంగా 1988లో జరిగిన సి పి ఐ 13 వ, జాతీయ మహాసభల్లో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యురాలుగా ఎన్నికైనరని అన్నారు. సిఐటియు లోనే కాక ఇతర కేంద్ర కార్మిక సంఘాలలో కూడా ఎంతోమంది ఆమెను అభిమానించే వారిని ప్రేమించే వారని ఎంతోమంది ఆత్మీయులను పొందిన ఆమె ఉద్యమ జీవితం ధన్యమైందని అన్నారు. జూలై 24 1999లో ముంబై హాస్పిటల్ లో 84 ఏళ్ల వయస్సులో మరణించే నాటి వరకు పేద ప్రజల శ్రేయస్సు కోసం కమ్యూనిస్టు పార్టీలో సిఐటియు ఉద్యమంలో ప్రముఖ పాత్ర పోషించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పులిజాల పరుశురాములు, బాలోత్సవ కమిటీ జిల్లా కన్వీనర్ టి.చెన్నయ్య, సివిల్ సప్లై యూనియన్ నాయకులు బీరయ్య, ప్రజానాట్యమండలి జిల్లా గౌరవాధ్యక్షులు జగన్ గ్రానైట్స్ అండ్ టైల్స్ హమాలి యూనియన్ నాయకులు ఆంజనేయులు ,మహేందర్, ప్రశాంత్ ,బాలస్వామి రైతు సంఘం నాయకులు యు. యాదయ్య పాల్గొన్నారు.

# అడుగంటుతున్న ఎల్లంపల్లి

**మంచిర్యాల :** మంచిర్యాల జిల్లాలో కల్పతరువులా ఉన్న 'శ్రీపాద ఎల్లంపల్లి'లో రోజురోజుకూ నీటి నిల్వలు తగ్గిపోతుండగా, కలవరం మొదలైంది. నీటి సరఫరా ఇలాగే కొనసాగితే నెలన్నరలో ప్రాజెక్టు అడుగంటి పోయి, మంచిర్యాలతో పాటు పెద్దపల్లి, హైదరాబాద్‌కు తాగు నీటికి ఇబ్బందులు తలెత్తే ప్రమాదమున్నది. ఈ విషయమై రెండు రోజుల క్రితం 'డేంజర్ బెల్స్' శీర్షికన 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక కథనం ప్రచురించగా, సిబ్బంది ఔట్‌ఫ్లోను కాస్త తగ్గించడం ప్రాధాన్యం సంతరించుకున్నది.

**తాగు నీటి సరఫరాకు ఇబ్బందులు తప్పవా..!**

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్ట్ మొత్తం కెపాసిటీ 20.1754 టీఎంసీలు(148 మీటర్లు) కాగా, గురువారం నాటికి 10.4707 టీఎంసీల(143.88 మీటర్ల) నీరు ఉన్నది. ఎల్లంపల్లి నుంచి హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లయ్ స్కీమ్‌కు 311 క్యూసెక్కులు, ఎన్‌టీపీసీకి 121 క్యూసెక్కులు, వేమునూరు పంప్‌హౌస్‌కు 247 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు. ఇది కాకుండా మిషన్‌భగీరథ స్కీమ్ కింద రామగుండం గ్రిడ్‌కు, మంచిర్యాల గ్రిడ్‌కు కలిపి 80 క్యూసెక్కుల దాకా నీరు అవసరం అవుతున్నది

పంటలు కోత దశలో ఉన్న నేపథ్యంలో గూడెం పంప్‌హౌస్‌కు 290 క్యూసెక్కుల నీరు ఇస్తున్నారు. వీటన్నింటికీ ఇలాగే నీటిని సరఫరా చేస్తే నెలన్నర రోజుల్లోనే ఎల్లంపల్లి అడుగండిపోయి మంచిర్యాలతో పాటు అటు పెద్దపల్లి ముఖ్యంగా హైదరాబాద్‌కు తాగునీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తే అవకాశాలున్నాయి. ఈ అంశపై 'నమస్తే తెలంగాణ' రెండు రోజులు క్రితం కథనం ప్రచురించిన నేపథ్యంలో ఔట్‌ఫ్లోను కాస్త తగ్గించారు. గురువారం ఎన్‌టీపీసీకి, నందీ పంప్‌హౌస్‌లకు నీటి సరఫరా చేయలేదని అధికారులు గణాంకాల్లో చూపించారు.

**గూడెంలిఫ్ట్ ఇంకా కొన్ని రోజులు నడిస్తే కష్టమే...**

కడెం ప్రాజెక్ట్ పరిధిలోని చివరి ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు ఏర్పాటు చేసిన గూడెం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ నుంచి 3 టీఎంసీలు నీళ్లు ఇవ్వాలనేది నిబంధన. దీని కింద దండేపల్లి, లక్షెట్టిపేట, హాజీపూర్ మండలాల్లో 30 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. కాకపోతే ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌లో 18 టీఎంసీల నీరు ఉంటేనే గూడెం లిఫ్ట్‌ను నడపాలి. కానీ, గత రెండు సంవత్సరాలు ఎండాకాలం ప్రారంభానికి ముందే ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌లో నీరు 18 టీఎంసీల కంటే దిగువకు చేరుతున్నది. స్థానిక రైతుల డిమాండ్ మేరకు 15 వేల ఎకరాల ఆరుతడి పంటలకు నీరు ఇస్తున్నారు.

ఈ మేరకు ఇప్పటికీ గూడెం లిఫ్ట్ నుంచి నీరు సరఫరా చేస్తున్నారు. గూడెం నుంచి 290 క్యూసెక్కుల నీరు



వదులుతున్నారు. మరికొన్ని రోజుల్లో పంటలు కోతకు వచ్చే దశలో ఉన్నాయి. ఇప్పటికీ గూడెంకు ఎల్లంపల్లి నుంచి నీటిని ఇస్తున్నారు. గూడెం లిఫ్ట్‌ను అలాగే నడిపిస్తే తాగునీటికి ఇబ్బందులు తప్పేవనే అంచనాలు వినిపిస్తున్నాయి. గతేడాది, అంతకు ముందు ఏడాది దాదాపు ఇదే పరిస్థితి నెలకొన్నప్పుడు మంచిర్యాలకు తాగునీటి ఇబ్బందుల రాకుండా చర్యలు తీసుకున్నారు. ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ నుంచి ప్రత్యేక కాలువలు తీసి పంప్‌హౌస్‌కు నీటి కొరత లేకుండా చూశారు. కానీ, ఈ సారి అలాంటి చర్యలు ఏవీ కనిపించకపోవడం ఆందోళనకరంగా మారింది.

**కాళేశ్వరం ఉంటే ఈ పరిస్థితి ఉండేనా..**

జిల్లాలోని మంచిర్యాల, చెన్నూర్ నియోజకవర్గాల్లోని దాదాపు 330 గ్రామ పంచాయతీలు, మరో 20 తండాలు, గూడేలకు ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌లోని మిషన్ భగీరథ గ్రిడ్ నుంచే తాగునీరు సరఫరా అవుతున్నది. జిల్లాలో ప్రతి రోజూ 6.75 ఎంఎల్‌డీ నీరు అంటే 0.09 టీఎంసీలు తాగడానికి కావాల్సి ఉంటుంది. మూడేళ్ల క్రితం దాకా ఎల్లంపల్లి ప్రాజెక్టులో పుష్కలమైన నీరు ఉండేది. కాళేశ్వరం ఎత్తిపోతల ద్వారా ప్రాజెక్టును నింపుకునే అవకాశం ఉండడంతో ఎల్లంపల్లిలోకి నీరు ఎత్తిపోసి సాగు, తాగునీటికి ఎలాంటి ఢోకా లేకుండా వాడుకునే వీలుండేది. కాళేశ్వరంలో ఎత్తిపోస్తే ఎల్లంపల్లి నిండుకుండలా మారిపోయేది. కానీ, ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. సాగునీటి నిర్వహణలో పూర్తిగా విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం మేడిగడ్డ ప్రాజెక్టును రిపేర్ చేయకపోవడంతో ఎల్లంపల్లి ఎండాల్సిన దుస్థితి వచ్చింది. దీంతో మూడేళ్ల క్రితం ఇదే సమయానికి బెడ్ లెవల్ నీటితో నిండుకుండను తలపించిన ఎల్లంపల్లి రోజురోజుకూ అడుగంటిపోతున్నది. ఎండల తీవ్రత ఇలాగే ఉండి, రోజూ ఇదే తరహాలో నీటిని తరలించాల్సి వస్తే మరో నెలన్నర రోజుల్లోనే ప్రాజెక్ట్ డెడ్ స్టోరేజీకి చేరుకోవచ్చని అధికారులు భావిస్తున్నారు. అదే జరిగితే హైదరాబాద్‌తో పాటు పెద్దపల్లి, మంచిర్యాల పట్టణాలకు తాగునీటి ఇబ్బందులు తప్పేలా లేవు. ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌లోని మంచిర్యాల మిషన్ భగీరథ పంప్‌హౌజ్ ఉన్న ప్రాంతంలో ఇప్పటికే నీరు అడుగంటిపోయి కనిపిస్తున్నాయి.

**గతేడాది కంటే మెరుగైన పరిస్థితి**

ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నీటి నిల్వలపై ఎల్లంపల్లి డీఈ బుచ్చిబాబును వివరణ కోరగా ప్రస్తుతం ఉన్న నిల్వలు జూలై దాకా సరిపోతాయన్నారు. గతేడాది ఈ సమయంతో పోలిస్తే ఈ ఏడాది రెండు టీఎంసీల నీరు అధికంగా ఉందన్నారు. యేటా ప్రాజెక్ట్‌లో ఉండే నీటి కంటే ఎక్కువ నిల్వలు ఉన్నందున సమస్య వచ్చు అవకాశాలే లేవన్నారు. ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తాగునీటికి ఇబ్బందులు లేకుండా నీటి సరఫరా చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

# ఆడ పిల్లలను జన్మనిస్తుందనే సాకుతో భార్య ఇద్దరు పిల్లలను హత్య

**వరంగల్ :** రాష్ట్ర వ్యాప్తంగా సంచలంగా మారిన భార్య ఇద్దరు బాలికల హత్యకు సంబంధించి కేసులో హత్య గురైన మృతురాలి భర్తతో పాటు ఈ హత్యలకు పరోక్షంగా కారణంగా నిలిచిన మరో తొమ్మిది మందిని పోలీసులు అరెస్టు చేయగా, మరో ఇద్దరు నిందితులు ప్రస్తుతం పరారీలో వున్నారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో ప్రధాన నిందితుడు వరంగల్ జిల్లా, పున్నెలు గ్రామానికి చెందిన యం.డి అజారుద్దీన్ (29)తో పాటు, నిందితుడి కుటుంబ సభ్యులు పున్నెలు గ్రామానికి చెందిన యం.డి చాంద్పాషా (49), యం.డి సలీహా (45), యం.షరోద్దీన్ (25)లతో పాటు బసిక స్రవంతి (32), కడిపికొండ, బాల్నె పార్ధు (47) నెక్కొండ, బొమ్మెర మనోహర్(39), గీసుగొండ, లింగాల నరేష్(37), కొండపర్తి, సాట్లరాజు (32), పున్నెలు, వాకుదోట్ భద్రు (60), ఎనుగల్లు చెందిన వారిని పోలీసులు అరెస్టు చేయగా, మరో ఇద్దరు నిందితులు డా. బాల్నె పూర్ణిమ, డా. ఎస్.రవళీ పరారీలో



వున్నారు. ఐనవోలు మండలం పున్నెలు గ్రామానికి చెందిన ప్రధాన నిందితుడు అజారుద్దీన్ ఇదే గ్రామానికి చెందిన మృతురాలు ఫరహాత్ను 2016 సంవత్సరంలో ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు హుమేరా (09), ఆయేషా (06) వున్నారు. తరువాత మృతురాలు గర్భం దాల్చడంతో తిరిగి అడ పిల్లకు జన్మనిస్తుందనే రెండు దఫాలు నిందితుడు మృతురాలికి అబార్షన్ చేయించడం జరిగింది.

ఇదే సమయంలో నిందితుడి దూరపు బంధువైన మైనర్ బాలికపై ప్రేమ పెంచుకున్న నిందితుడు పెళ్ళి చేసుకుంటానని మైనర్ బాలికకు నిందితుడు తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసాడు.నీకు ఇంతకు ముందే పెళ్ళి అయి ఇద్దరు పిల్లలు వున్నారు. నేను నిన్న పెళ్ళి చేసుకోనని మైనర్ బాలిక నిరాకరించడంతో, తనకు భార్య పిల్లలు వుండటం కారణంగానే మైనర్ బాలిక పెళ్ళి అంగీకరించడం లేదని భార్య పిల్లలపై కక్ష్య పెంచుకున్నాడు తను ప్రస్తుతం ప్రేమిస్తున్న బాలికను పెళ్ళి చేసుకోవాలంటే భార్య, పిల్లలు బ్రతికుండగా సాధ్యం కాదని, వారిని చంపడం ద్వారా ఇది సాధ్యమని నిర్ణయించుకున్నాడు

## ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత



**బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

కల్వకుర్తి నియోజకవర్గం లోని తలకొండపల్లి మండలం పెద్దూర్ తండా గ్రామపంచాయతీలో మూడవత్ శంకర్ నాయక్ అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది. దేవుని పడకల్ (పెద్దూర్ )మాజీ ఎంపీటీసీ మూడవత్ రఘు నాయక్ ద్వారా విషయం తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ తలకొండపల్లి మాజీ జెడ్పిటిసి శఉప్పల వెంకటేష్ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ 3000 మూడు వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో దేవుని పడకల్ (పెద్దూర్ )మాజీ ఎంపీటీసీ మూడవత్ రఘు నాయక్ ఉప సర్పంచ్ మూడవత్ భాస్కర్ మాజీ సర్పంచ్ మూడవత్ సక్రి కిషన్ వార్డు సభ్యులు మూడవత్ శోభ శ్రీను మూడవత్ శ్రీను మూడవత్ రుకి బాషా మూడవత్ గోగ్లీ కిష్ట మూడవత్ సక్రి కిషన్ గ్రామ పెద్దలు మాజీ వార్డ్ మెంబెర్ పుల్యా నాయక్ రవి బిచ్చ నాయక్ మరియు చిరంజీవి తదితరులు పాల్గొనడం జరిగింది.

## ఉప్పల చారి ట్రబుల్ ద్వారా నిరుపేద కుటుంబానికి చేయూత




**బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

తలకొండపల్లి మండలశీ లోనీ జూలపల్లి గ్రామ పంచాయతీకి చెందిన బైండ్ల మహేందర్ తండ్రి పేరు శంకరయ్య నిరుపేద కుటుంబానికి చెందిన వారు కావడంతో వారు నిర్మించుకున్న ఇంటి నిర్మాణం అసంపూర్తిగా మిగిలిపోవడం తో స్థానిక బీఆర్ ఎస్ పార్టీ నాయకుల ద్వారా రాష్ట్ర మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ నీ వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది.వెంటనే స్పందించి తన ట్రస్టు ద్వారా స్లాబ్ కొరకు సిమెంట్ స్టీల్ ఇప్పించడం జరిగింది ఈ సందర్భంగా ఆ కుటుంబ సభ్యులు ఉప్పల వెంకటేష్ కి ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ విజయ్ కుమార్ రెడ్డి గోవర్ధన్ గౌడ్ అశోక్ బి శివ నాగయ్య రాఘవేందర్తదితరులు పాల్గొన్నారు

## ఈ నెల 14 న హిందూ సమ్మేళనం విజయవంతం చేయండి..!

**అగ్నిధార న్యూస్ కమాన్ పూర్,**

ఈనెల 14న కమాన్ పూర్ మండల కేంద్రంలోని అంగడి బజారులో నిర్వహించనున్న హిందూ సమ్మేళనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఇందు ఉత్సవ సమితి కమాన్ పూర్ ఉప మండలం అధ్యక్షులు ముకుంద రాజన్న కోరారు. కమాన్ పూర్ మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద గల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం ముందు శుక్రవారం హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో వాల్ పోస్టర్లు, కర పత్రాలను ఆవిష్కరించారు.

**ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ...**

హిందూ సమాజాన్ని చైతన్య పరిచి సమైక్య పరిచే దృఢ సంకల్పంతో ఈ మహత్తర హిందూ సమ్మేళనం కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. హిందువుల్లో ఐక్యత బావం పెంపొందించడం, హిందూ సమాజం పట్ల గౌరవ భావాన్ని, ఎకాత్మా భావన, స్వధర్మం పట్ల అంకిత భావం, సేవా గుణం వంటి వాటిని వికసింపజేసేందుకు నిర్వహిస్తున్న హిందూ సమ్మేళనం కార్యక్రమంలో హిందువులు అందరూ కుటుంబ సమేతంగా పాల్గొనగలరని కోరారు. ఈ హిందూ సమ్మేళనం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విష్ణుసేవానంద గిరి స్వామి, తారా బాయి, సామల కిరణ్ హాజరావుతున్నారన్నారు. మండలంలో నుండి పెద్ద సంఖ్యలో హిందువులు తరలివచ్చి "హిందూ సమ్మేళనం" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హిందూ బాందవులు పాల్గొన్నారు.

## ప్రియురాలికి హెచ్ఐవీ రక్తం ఘటనలో విషాదం.. అవమానం, బాధతో యువతి ఆత్మహత్య

**హైదరాబాద్ :** హైదరాబాద్‌లో ఇటీవల ఓ యువకుడు తన ప్రియురాలికి హెచ్ఐవీ ఇంజెక్షన్ ఇచ్చిన ఘటనలో విషాదం చోటుచేసుకుంది. పెళ్లికి నిరాకరించిందనే కోపంతో ఓ యువకుడు యువతికి బలవంతంగా హెచ్ఐవీ సోకిన రక్తాన్ని ఎక్కించగా, ఆ మనస్తాపంతో బాధిత యువతి తన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. చిన్ననాటి నుంచి ప్రేమించిన వ్యక్తే తన జీవితాన్ని ఇలా నాశనం చేశాడన్న బాధతో ఆమె ఈ కఠిన నిర్ణయం తీసుకుంది. పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది.జనగామ జిల్లాకు చెందిన యువకుడు హైదరాబాద్‌లో ట్రాన్స్‌పోర్ట్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. అతడి తల్లిదండ్రులిద్దరికీ హెచ్ఐవీ పాజిటివ్ ఉండగా, తండ్రి గతంలోనే మరణించాడు. సమీప బంధువైన యువతిని అతడు ప్రేమించగా, పెద్దలు కూడా పెళ్లికి అంగీకరించారు. అయితే, వివాహానికి ముందు యువతి తండ్రి జరిపించిన రక్త పరీక్షల్లో యువకుడికి కూడా హెచ్ఐవీ ఉన్నట్లు తేలింది. దీంతో యువతి కుటుంబ సభ్యులు ఈ పెళ్లిని రద్దు చేసుకున్నారు. కుమార్తె జీవితాన్ని తెలిసి నాశనం చేయలేమని, యువకుడి కుటుంబానికి వారు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు.వివాహం రద్దవడాన్ని జీర్ణించుకోలేకపోయిన నిందితుడు, తాను ప్రేమించిన యువతికి కూడా హెచ్ఐవీ సోకితే మరెవరూ పెళ్లి చేసుకోరని, అప్పుడు కచ్చితంగా తననే చేసుకుంటుందని వికృతంగా ఆలోచించాడు. మార్చి నెల 11న తన రక్తాన్ని సిరంజీలోకి తీసుకుని, యువతి ఇంటికి వెళ్లి ఆమె నిరాకరించడంతో బలవంతంగా ఆ రక్తాన్ని ఎక్కించి పారిపోయాడు. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే, ప్రాణాంతక వ్యాధి సోకిందన్న ఆందోళన, సమాజంలో ఎదురయ్యే అవమానం తట్టుకోలేక ఆ యువతి ప్రాణాలు తీసుకోవడం అందర్నీ కలచివేస్తోంది. తన తప్పు లేకున్నా, ఆమె చనిపోయిందని తెలియడంతో స్థానికంగా విషాదం నెలకొంది.ఈ ఘటనలో ఆ యువకుడు దారుణమైన తప్పిదం చేశాడు. ప్రేమించిన యువతి హాయిగా ఉండాలని ఆలోచించలేదు. తన కుటుంబంతో పాటు తనకు హెచ్ఐవీ ఉందని గమనించి సైలెంట్ గా ఉండలేదు. అదే కారణంతో తనను రిజెక్ట్ చేయడం, పెళ్లి రద్దు కావడంతో ఆమెను ఎలాగైనా దక్కించుకోవాలని ప్రమాదకర హెచ్ఐవీ రక్తాన్ని ఆమెకు బలవంతంగా ఇంజెక్ట్ చేశాడు. అలా చేస్తే ఆమె నిజంగానే అతడ్ని పెళ్లి చేసుకుంటుందా? నేరస్తుడిగా జైలుకు వెళ్తానని మాత్రం ఆలోచించలేకపోయాడు.



## చరిత్రను తిరగరాసిన రణ్‌వీర్ సింగ్..

**రూ.1000 కోట్ల క్లబ్‌లో చేరిన మొదటి బాలీవుడ్ సినిమాగా 'ధురంధర్ 2'**

బాలీవుడ్ చిత్ర పరిశ్రమలో సరికొత్త చరిత్ర ఆవిష్కృతమైంది. స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ కథానాయకుడిగా, దర్శకుడు ఆదిత్య ధర్ రూపొందించిన భారీ స్పై యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్ 2' బాక్సాఫీస్ వద్ద రికార్డుల వేటను కొనసాగిస్తూ సరికొత్త మైలురాయిని అధిగమించింది. గతంలో 'బాహుబలి 2', 'పుష్ప 2' వంటి చిత్రాలు అన్ని భాషల్లో కలిపి భారీ వసూళ్లు సాధించినప్పటికీ, కేవలం హిందీ వెర్షన్‌లోనే రూ.1000 కోట్ల నెట్ వసూళ్లను సాధించిన మొదటి భారతీయ చిత్రంగా 'ధురంధర్ 2' రికార్డు సృష్టించింది. ఈ ఘనత సాధించిన తొలి బాలీవుడ్ చిత్రంగా ఇది చరిత్రలో నిలిచిపోనుంది. ఈ సినిమా విడుదలైన నాటి నుంచే థియేటర్ల వద్ద కాసుల వర్షం కురిపిస్తున్న సంగతి తెలిసిందే. ట్రేడ్ అనలిస్టుల అంచనాలను తలకిందులు చేస్తూ, కేవలం 21 రోజుల్లోనే రూ.1041 కోట్ల నికర వసూళ్లను రాబట్టింది. ఇక ప్రపంచవ్యాప్తంగా గ్రాస్ వసూళ్ల విషయానికి వస్తే, ఈ చిత్రం ఇప్పటికే రూ.1665 కోట్ల మార్కును దాటి తన జైత్రయాత్రను కొనసాగిస్తోంది. 2025లో బ్లాక్‌బస్టర్ హిట్ సాధించిన 'ధురంధర్'కు సీక్వెల్‌గా వచ్చిన ఈ చిత్రం, కథా బలంతో పాటు అబ్బురపరిచే యాక్షన్ సీక్వెన్స్‌లతో ప్రేక్షకులను కట్టిపడేసింది. రణ్‌వీర్ సింగ్ తన కెరీర్ బెస్ట్ పెర్ఫార్మెన్స్‌కు తోడు, సంజయ్ దత్, ఆర్. మాధవన్, అర్జున్ రాంపాల్ వంటి దిగ్గజ నటుల కలయిక సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. సారా అర్జున్, రాకేష్ బేడీ తమ నటనతో సినిమాకు వెన్నుముకగా నిలిచారు.

## రావు బహదూర్' నుంచి ఫస్ట్ సింగిల్ అప్‌డేట్



వైవిధ్యమైన కథలు ఎంచుకుంటూ ఇండస్ట్రీలో మంచి గుర్తింపు తెచ్చుకున్న నటుడు సత్యదేవ్ ప్రధాన పాత్రలో నటిస్తున్నలేటెస్ట్ చిత్రం 'రావు బహదూర్'. 'కేరాఫ్ కంచరపాలెం' ఫేమ్ దర్శకుడు వెంకటేష్ మహా తెరకెక్కిస్తున్న ఈ చిత్రం నుంచి ఇప్పటికే వచ్చిన టీజర్, ఫస్ట్ లుక్ పోస్టర్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ ఫస్ట్ లుక్, టీజర్ ఆధారంగా ఇది ఒక విభిన్నమైన పీరియడ్ డ్రామా అని, సత్యదేవ్ తన కెరీర్‌లో డిఫరెంట్ రోల్ చేస్తున్నారని అర్థం అవుతుంది. ఇదిలా ఉంటే తాజాగా ఈ మూవీ నుంచి ఫస్ట్ సింగిల్ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ మేరకు ఓ కూల్ పోస్టర్ రిలీజ్ చేస్తూ.. 'ప్రేమకు అంకితం, ప్రేమ నుండే పుట్టిన గీతం 'ఓ సుందరి'.. 'రావు బహదూర్' నుంచి ఫస్ట్ సింగిల్ ఓ సుందరి ఏప్రిల్ 15న విడుదలవుతోంది' అని తెలిపారు. ఇక విడుదల చేసిన పోస్టర్‌లో హీరో అండ్ హీరోయిన్ లుక్ కూల్‌గా ఆకట్టుకుంటోంది. కాగా.. మహేష్ బాబు, నమ్రత సమర్పిస్తున్న ఈ చిత్రం క్షీణిస్తున్న కులీన వర్గాల నేపథ్యంతో సాగుతుంది. ఇందులో సత్యదేవ్‌తో పాటు దీప థామస్, ఆనంద్ భారతి ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. 2026 సమ్మర్ టార్గెటా ఈ చిత్రం రిలీజ్‌కు సిద్ధం అవుతుండగా.. డేట్ త్వరలో ప్రకటించనున్నారు మేకర్స్.



## మనకు దక్కాల్సినవి సరైన సమయం వచ్చినప్పుడే దక్కుతాయి..

మలయాళ ముద్దుగుమ్మ మమితా బైజు.. ప్రజెంట్ బ్యాక్ టు బ్యాక్ పాన్ ఇండియా ఆఫర్స్ అందుకుంటూ బిజీ లైఫ్ లీడ్ చేస్తుంది. ఆమె నటిస్తున్న వరుస ప్రాజెక్టులలో 'విశ్వనాథ్ అండ్ సన్స్' ఒకటి. కోలీవుడ్ వర్సటైల్ యాక్టర్ సూర్య, సెన్సిబుల్ డైరెక్టర్ వెంకీ అట్లూరి కాంబినేషన్‌లో రాబోతున్న ఈ ప్రాజెక్టు సంబంధించిన షూటింగ్ ప్రజెంట్ శరవేగంగా జరుగుతున్నది. ఇందులో భాగంగానే తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొని సినిమాపై ఆసక్తికర కామెంట్స్ చేసింది మమిత. 'విశ్వనాథ్ అండ్ సన్స్ చిత్రంలో ఎంటర్‌టైన్మెంట్‌తో పాటు బలమైన ఎమోషనల్ కంటెంట్ కూడా ఉంటుంది. ఇది ఒక సంపూర్ణ వినోదాత్మక చిత్రంగా రూపొందగా.. ఈ చిత్రం ప్రేక్షకులకు పూర్తిస్థాయిలో ఎగ్జైట్‌మెంట్ ఎక్స్‌పీరియన్స్‌ను ఇస్తుంది. నన్ను నమ్మండి.. ఈ సినిమా అద్భుతంగా ఉండబోతోంది' అని తెలిపింది. అలాగే తన సినీ ప్రయాణం గురించి మాట్లాడుతూ.. 'నేను మలయాళ చిత్రసీమలో నా ప్రయాణాన్ని ఒక సహాయ నటిగా ప్రారంభించాను. ఇప్పుడు ప్రధాన పాత్రల వైపు అడుగులు వేస్తున్నాను. ప్రతి విషయాన్ని దశలవారీగా ముందుకు తీసుకెళ్లడాన్ని నేను విశ్వసిస్తాను.. ఎందుకంటే మనకు దక్కాల్సినవి సరైన సమయానికి తప్పక మనల్ని చేరుతాయి' అంటూ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది మమిత.

## రాజశేఖర్ ఫిట్‌నెస్ సీక్రెట్



టాలీవుడ్ సీనియర్ హీరో రాజశేఖర్ ఈ మధ్యే తన సెకండ్ ఇన్నింగ్స్ మొదలుపెట్టి వరుస సినిమాలతో ప్రేక్షకులను పలకరిస్తున్నాడు. కొంత కాలం క్రితం నితిన్ హీరోగా రూపొందిన ఎక్స్ట్రా ఆర్డినరీ మ్యాన్ చిత్రంలో కీలకమైన పాత్రలో నటించి ప్రేక్షకులను అలరించాడు. ఈ చిత్రం బాక్స్ ఆఫీస్ దగ్గర ఫెయిల్యూర్ అయింది. తాజాగా శర్వానంద్ ప్రధాన పాత్రలో రూపొందిన బైకర్ చిత్రంలో ఈయన శర్వానంద్ కి తండ్రి పాత్రలో నటించాడు. ఈ మూవీలోని రాజశేఖర్ పాత్రకు మంచి ప్రశంసలు దక్కుతున్నాయి. ప్రస్తుతం రాజశేఖర్ వయస్సు 64 సంవత్సరాలు, అయినా కూడా ఈ సీనియర్ నటుడు ఎంతో ఫిట్‌గా, అందంగా కనబడుతున్నాడు. దాంతో ఈయన ఎలాంటి డైట్ పాటిస్తాడు అని తెలుసుకోవాలి అనే ఉత్సాహం జనాల్లో బాగానే ఉంది. తాజాగా రాజశేఖర్ ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. అందులో ఆయన రోజు ఎలాంటి ఫుడ్ తీసుకుంటారు అనేది క్లియర్గా చెప్పుకొచ్చాడు. రాజశేఖర్ మాట్లాడుతూ... నేను రోజు తీసుకునే ఆహారం విషయంలో ఎక్కువ శాతం పండ్ల రసాలకు ప్రాముఖ్యత ఇస్తాను. రోజులో వాటిని ఎక్కువ మోతాదులో తీసుకుంటాను. కేవలం మంచి ఫుడ్ తీసుకోవడం మాత్రమే కాకుండా రోజులో కొన్ని గంటల పాటు వ్యాయామం కూడా చేస్తుంటాను. దాని ద్వారా కూడా మన శరీరం ఎంతో బాగుంటుందని, ఇలా మంచి డైట్, శరీరానికి తగిన ఎక్సర్సైజ్ రెండూ సమాన స్థాయిలో మెయింటెన్ చేయడం వల్లే తాను ఈ వయసులో కూడా అందంగా ఉన్నట్లు రాజశేఖర్ తాజాగా చెప్పుకొచ్చారు.

## రూ.10 కోట్లు పెడితే రూ.100 కోట్లు.. మలయాళంలో హిట్టు కొట్టిన తెలుగు నిర్మాత



మలయాళంలో రెండేళ్ల క్రితం సంచలన విజయం సాధించిన చిత్రాల్లో "వాళా" ఒకటి. కేవలం రూ.4 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ మూవీ ఏకంగా రూ.40 కోట్లు వసూలు చేసింది. వాళా అంటే మలయాళంలో అరటి మొక్క అని అర్థం. అలాగే పనీపాటా లేకుండా తిరిగే సోమరులని కూడా అదే పేరుతో పిలుస్తారు. వాళా చిత్రానికి 'బయోపిక్ ఆఫ్ బిలియన్ బాయ్స్' అనేది ట్యాగ్‌లైన్ ఇచ్చారు.

**మలయాళంలో హిట్ కొట్టిన తెలుగు డైరెక్టర్**

2024లో వచ్చిన ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'వాళా 2' వచ్చింది. 'బయోపిక్ ఆఫ్ బిలియన్ బ్రోస్' అనేది ఉపశీర్షిక. ఈ రెండు భాగాలకు కథ అందించింది విపిన్ దాస్ ఒక్కరే అయినా.. దర్శకులు మాత్రం మారారు. మొదటి భాగానికి ఆనంద్ మీనన్ దర్శకత్వం వహించగా రెండో భాగాన్ని సవిన్ డైరెక్ట్ చేశాడు. సీక్వెల్‌కు రూ.10 కోట్ల బడ్జెట్ కేటాయించారు. తెలుగు నిర్మాత సాహు గారపాటి ఈ సినిమా నిర్మాతల్లో ఒకరిగా ఉన్నాడు.

**సెంచరీ కొట్టిన వాళా 2**

ఏప్రిల్ 2న విడుదలైన ఈ చిత్రం ఏకంగా సెంచరీ కొట్టింది. కేవలం వారం రోజుల్లోనే రూ.100 కోట్ల క్లబ్‌లో చేరిపోవడం విశేషం. ఈ ఏడాది మన శంకరవరప్రసాద్‌గారుతో హిట్ అందుకున్న సాహు గారపాటి.. మూడు నెలల్లో వాళా 2తో మరో బ్లాక్‌బస్టర్ అందుకున్నాడు. కాగా వాళా మొదటి భాగం హాట్‌స్టార్‌లో మలయాళంతో పాటు తెలుగులోనూ అందుబాటులో ఉంది.



## వరుణ్ తేజ్ కొరియన్ కనకరాజు నుంచి ఫస్ట్ సింగిల్ ప్రోమో!

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్, దర్శకుడు మేర్లపాక గాంధీ కాంబినేషన్‌లో వస్తున్న లేటెస్ట్ క్రేజీ ప్రాజెక్ట్ 'కొరియన్ కనకరాజు' ఇండో-కొరియన్ నేపథ్యంలో హారర్-కామెడీ జోనర్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమా మ్యూజికల్ ప్రమోషన్స్‌ను చిత్ర బృందం ఘనంగా ప్రారంభించింది. ఈ చిత్రంలోని మొదటి పాట 'కమ్సాహంనిదా' ప్రోమోను తాజాగా విడుదల చేయగా, దీనికి విశేష స్పందన లభిస్తోంది. సంగీత దర్శకుడు ఎస్. థమన్, వరుణ్ తేజ్ మరియు దర్శకుడు మేర్లపాక గాంధీ మధ్య సాగే ఫన్నీ సంభాషణలతో కూడిన ఈ ప్రోమో యూట్యూబ్‌లో ట్రెండింగ్‌గా నిలిచింది. మెలోడీ కింగ్ సిద్ శ్రీరామ్ ఆలపించిన ఈ పూర్తి పాటను ఏప్రిల్ 11న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ చిత్రంలో వరుణ్ తేజ్ సరసన రితికా నాయక్ కథానాయికగా నటిస్తుండగా, స్టార్ కమెడియన్ సత్య కీలకమైన వినోదాత్మక పాత్రలో అలరించనున్నారు. కొరియా సంస్కృతికి మరియు లోకల్ క్యారెక్టర్ అయిన కనకరాజుకు మధ్య ఉన్న విచిత్రమైన సంబంధాన్ని దర్శకుడు మేర్లపాక గాంధీ తన మార్కు వినోదంతో వెండితెరపై ఆవిష్కరించబోతున్నాడు. ఇప్పటికే మేజర్ షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం, ఆఖరి షెడ్యూల్‌ను దక్షిణ కొరియాలోని అందమైన లొకేషన్లలో పూర్తి చేసుకోబోతుంది. యూవీ క్రియేషన్స్ మరియు ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై వంశీ, ప్రమోద్ మరియు విక్రమ్ ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. వరుస పరాజయాల తర్వాత వరుణ్ తేజ్ ఈ డిఫరెంట్ కథాంశంతో మళ్లీ హిట్ ట్రాక్ ఎక్కడం ఖాయమని అభిమానులు ఆశిస్తున్నారు. మనోజ్ రెడ్డి సినిమాటోగ్రఫీ అందిస్తున్న ఈ సినిమాను 2026 వేసవి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు.

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com